

6 నుంచి రెవెన్యూ సదస్సులు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈ నెల 6 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు జిల్లాలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ తెలిపారు. మండలాల్లో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు చెప్పారు.

శ్రీశైలం ఈవోగా శ్రీనివాసరావు



శ్రీనివాసరావు

శ్రీశైలం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారిగా డిప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీనివాసరావును నియమిస్తూ రాష్ట్ర దేవదాయశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సత్యనారాయణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైద్య ఆరోగ్యశాఖలో కార్యదర్శి హోదాలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావును డిప్యుటేషన్‌పై ఏడాది పాటు శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

రద్దీ రోజుల్లో స్పర్శ దర్శనం నిలుపుదల



శ్రీశైలం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైలం మల్లికార్జున స్వామివారి స్పర్శదర్శనం, ఆర్జిత గర్భాలయ, సామూహిక అభిషేకాలను రద్దీ రోజులు శని, ఆది, సోమ, ప్రభుత్వ సెలవు రోజులు, ప్రత్యేక రోజుల్లో పూర్తిగా నిలుపుదల చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అదేవిధంగా ఉదయాస్తమాన సేవ, ప్రాతఃకాల సేవ, ప్రదోషకాల సేవలు కూడా నిలుపుదల చేశారు. ఈ రోజులలో భక్తులందరికీ స్వామివారి అలంకరణ దర్శనం మాత్రమే కల్పించనున్నట్లు తెలిపారు. కాగా రద్దీ రోజుల్లో వృద్ధ మల్లికార్జున స్వామికి జరిగే ఆర్జిత అభిషేకాలు, ఆలయంలో జరిగే అన్ని రకాల ఇతర ఆర్జిత;సేవలు యథావిధిగా ఉంటాయి. అలాగే అమ్మవారి ముఖ మండపంలో నిర్వహించుకునే కుంకుమార్చనను రద్దీ రోజులలో నిలుపుదల చేస్తున్నట్లు చెప్పారు. ఈ సేవలకు సంబంధించిన టికెట్లను ఇప్పటికే ఆన్‌లైన్‌లో నిలుపుదల చేసినట్లు, ముందుగానే టికెట్లు పొందిన భక్తులకు మాత్రం సేవలను నిర్వహించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. క్షేత్రానికి రోజురోజుకూ పెరుగుతున్న రద్దీ దృష్ట్యా సామాన్య భక్తులకు ప్రాధాన్యం ఇస్తూ సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకే దేవస్థానం వైదిక కమిటీ, అధికారుల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

సంక్షేమం సిగ్గుపడాల్సిందే

ఆంధ్రజ్యోతి పరిశీలన

పెద్దపాడులోని బీసీ బాలుర హాస్టల్‌లో అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలు



- దుర్భరంగా వసతి గృహాలు
- నిర్లక్ష్యానికి నిదర్శనం
- సమస్యల వలయంలో హాస్టళ్లు

కర్నూలు అర్బన్‌లోని పెద్దపాడు గ్రామంలోని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని బీసీ బాలుర హాస్టల్ అధ్వాన స్థితిలో ఉంది. ఈ హాస్టల్‌లో 240 మంది నుంచి విద్యార్థులు చదువుకుంటున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం పక్కనే ఉన్న ఈ వసతి గృహం భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇందులో ఆరు గదులు ఉండగా.. ఒకటి పూర్తిగా నిరుపయోగంగా మారడంతో దాన్ని మూసేశారు. ఈ భవనానికి ఆనుకుని షెడ్డును ఏర్పాటు చేశారు. స్నానపు గదులు, మరుగుదొడ్లు పాడైపోయాయి. దీంతో ఆరుబయటనే స్నానాలు చేస్తున్నారు. అలాగే బహిర్భూమికి ఆరుబయటకే వెళ్తున్నారు. చలి కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. బీసీ సంక్షేమ శాఖ ద్వారా నాసిరకం దుప్పట్లు సరఫరా చేశారు. అవి చలిని ఆపలేకపోతున్నాయి. ఆంధ్రజ్యోతి సోమవారం రాత్రి 10 గంటల సమయంలో విజిట్ చేయగా హాస్టల్లోని విద్యార్థి మలమూత్ర విసర్జనకు బయటకు వెళ్తుండగా.. పాము కంట పడటంతో భయంతో కేకలు వేస్తూ లోపలికి వచ్చాడు. దీంతో విద్యార్థులు వేటాడి ఆ పామును చంపేశారు. ఆ తర్వాత చీకటిలోనే కట్టెపుల్లలను వెతికి చితి రాజేసి చనిపోయిన పామును మంటల్లో కాల్చేశారు. ఇట్లా తమ హాస్టల్ పరిసరాల్లో పాములు, కుక్కలు, పందులు తిరుగుతున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. హాస్టల్ బోరు బావితో ఉప్పు నీరు రావడంతో విద్యార్థులు మంచినీరు బైటికి వెళ్లి తెచ్చుకుంటున్నారు. ఈ హాస్టల్ భవనానికి ప్రహరి లేదు. వర్షం నీరు చేరి బురదమయంగా మారుతుందని, ముఖ్యంగా చలికి ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వివరించారు. అయితే స్నానాలు, మరుగుదొడ్ల సులభ్ కాంప్లెక్స్ పనులు పూర్తయినప్పటికీ ఇంకా ప్రారంభించలేదు.



కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు దుర్భరంగా తయారయ్యాయి. కనీస వసతులు లేక విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. సంక్షేమం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఈ హాస్టళ్లు ఉదాహరణగా మారాయి. నాసిరకం దుప్పట్లు ఇవ్వడంతో అవి చలి నుంచి విద్యార్థులను కాపాడటం లేదు. కిటికీలకు తలుపులు లేవు. స్నానపు గదులు, మరుగుదొడ్ల కొరత వేధిస్తోంది. దీంతో బహిరంగ స్నానాలు చేయాల్సి వస్తున్నది. చాలా హాస్టల్స్‌కు ప్రహరీలు లేవు. విషపురుగులు, పాములు సంచరిస్తున్నాయి. ఆంధ్రజ్యోతి క్షేత్ర పరిశీలనలో హాస్టళ్ల దుస్థితి వెలుగులోకి వచ్చింది.

తాగునీరు లేని వసతి గృహాలు

ఆస్పరి : ఆస్పరిలో ఎస్సీ వసతి గృహం, చిన్న హోత్తూరులో బీసీ వసతి గృహం ఉన్నాయి. ఆస్పరి వసతి గృహంలో విద్యార్థులు 36 మంది, చిన్న హోత్తూరు వసతి గృహంలో 183 మంది విద్యార్థులు ఉన్నారు. వీటిలో తాగునీటి సౌకర్యం లేదు. ఆస్పరి వసతి గృహంలో ఉన్న తాగునీటి సింటెక్స్ ట్యాంకులు పగిలిపోవడంతో నీరు వృథాగా మారి అక్కడే నిల్వ ఉండడంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది విద్యార్థులు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఒకే బెడ్ షీట్ పంపిణీ చేసింది. చలి తీవ్రంగా ఉండడంతో విద్యార్థులు రాత్రిళ్లు వణుకుతూ పడుకుంటున్నారు. పైగా వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు.



చిన్నహోత్తూరులో వంట గది పక్కనే మురుగు

ఇండ్ల నుంచి దుప్పట్లు

ఆదోని: అధికారులు ఇచ్చిన నాసిరకం దుప్పట్లను విద్యార్థులు ట్రంక్ పెట్టెలో ఉంచేసి, ఇంటి నుంచి తెచ్చుకున్న మందపాటి ఉలన్ దుప్పట్లను కప్పుకొని రాత్రిపూట నిద్రపోతున్నారు. ఆదోని పట్టణంలోని ఎస్సీ బాలుర నెంబర్-1 హాస్టల్లో 100మంది విద్యార్థులుండగా మంగళవారం 75మంది మాత్రమే హాజరు కాగా, 25మంది విద్యార్థులు గ్రామాల్లో గౌరమ్మ పండుగ ఉందని వెళ్ళి తిరిగి రాలేదు. గత నెల విద్యార్థులకు నాసిరకం దుప్పట్లు ఇచ్చారు. అవి చలికి రక్షణ ఇవ్వలేవని వాటిని పెట్టెల్లో పడేసి ఇండ్ల నుంచి ఉలన్ దుప్పట్లు తెచ్చుకున్నారు. మండగిరి ఏరియాలో ఉన్న బీసీ బాలుర వసతి గృహంలో 215మంది విద్యార్థులకు గాను 175 మంది ఉన్నారు. హాస్టల్ భవనం పెచ్చులూడిపోవడంతో ఇటీవల బీసీ సంక్షేమ శాఖ రూ.13 లక్షలు మరమ్మతు కోసం నిధులు మంజూరు చేసింది. ఓ కాంట్రాక్టర్ రెండు నెలలుగా పనులు చేస్తున్నారు. పైకప్పు పెచ్చులూడిన చోట సిమెంటు పూత పూసి వదిలేశారు. ఫ్యాన్‌లు ఏర్పాటు చేయలేదు. కిటికీలకు మెష్ లేక దోమలతో విద్యార్థులు అవస్థ పడుతున్నారు.

అద్దె భవనంలో ఆలూరు బీసీ బాలుర హాస్టల్

ఆలూరు: ఆలూరు బీసీ బాలుర హాస్టల్ అద్దె భవనంలో కొనసాగుతున్నది. ఇందులో 150 విద్యార్థులు ఉండగా సోమవారం రాత్రి 120 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఇంత మంది విద్యార్థులకు 3 మరుగు దొడ్లు మాత్రమే ఉన్నాయి. దీంతో బహిర్భూమికి బయటకు వెళ్తున్నారు. 10 మాత్రమే స్నానం గదులు ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆంధ్రజ్యోతి విజిట్‌లో విద్యార్థులు తెలిపారు.



అద్దె భవనంలో కొనసాగుతున్న ఆలూరు బీసీ బాలుర హాస్టల్

ఇంటి దుప్పట్లే గతి

పెద్దకడుబూరు: పెద్దకడబూరులోని బీసీ హాస్టల్‌లో ఏడు రూమ్‌లు ఉన్నాయి. వీటిలో రెండు శిథిలమైపోవడంతో మూసివేశారు. సోమవారం ఆంధ్రజ్యోతి విజిట్ చేయగా 60 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులకు ఇచ్చిన దుప్పట్లు నాసిరకంగా ఉండటంతో అవి చలి నుంచి కాపాడటం లేదు. దీంతో ఇంటి నుంచి దుప్పట్లు తెచ్చుకొని కాలం వెళ్లబుచ్చుతున్నారు. బాత్‌రూమ్‌ల్లోంచి నీరు బయటకు పోకపోవటంతో ఆరుబయటే స్నానాలు చేస్తున్నారు. విద్యార్థులకు వేడి నీళ్లు ఇవ్వటం లేదు. ఆదోని కాలేజీ హాస్టల్ వార్డెన్ హనిమిరెడ్డి పెద్దకడబూరు హాస్టల్‌కు ఇన్‌చార్జిగా నియమించడంతో ఆయన స్థానికంగా ఉండటం లేదు.



ఆదోని: హాస్టల్‌లో నిద్రిస్తున్న విద్యార్థులు

మిగతా 6లో..


అడుగుపడని ఐకానిక్


అత్మకూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దుల్లోని సోమేశ్వరం - సంగమేశ్వరం అనుసంధానంగా కృష్ణా నదిపై ఐకానిక్ సస్పెన్షనబుల్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి సంకల్పించింది. రెండేళ్ల కింద కేంద్ర ప్రభుత్వం నిధులు ప్రకటించింది. 30 నెలల్లో నిర్మాణం చేపడతామని కేంద్ర మంత్రి ఆర్భాటంగా ప్రకటించారు. ఇవన్నీ పైపై వ్యవహారాలే. పనుల్లో నికరంగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇంతకూ ఈ ఐకానిక్ బ్రిడ్జ్ నిర్మించే ఉద్దేశం ప్రభుత్వానికి ఉందా? అనే సందేహం ప్రజలకు కలుగుతోంది.

కృష్ణానదిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రయాణ సౌకర్యం లేక స్థానిక ప్రజలు చాలా ఏళ్లుగా ఇబ్బందిపడుతున్నారు. నదికి ఇరువైపుల తెలంగాణలో సోమేశ్వరాలయం, ఆంధ్రాలో సంగమేశ్వరాలయం క్షేత్రాలు ఉన్నాయి. వీటి మధ్య నది మీద వంతెన నిర్మిస్తే ఇరుప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధి కూడా జరిగే అవకాశం ఉంది. హైద్రాబాద్ నుంచి తిరుపతి, చెన్నై, నంద్యాల వంటి ప్రాంతాలకు దూరం తగ్గుతుంది. ఇందుకోసం ప్రపంచంలోనే రెండవదిగా, దేశంలోనే తొలి ఐకానిక్ సస్పెన్షనబుల్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి రెండేళ్ల క్రితం రూ.1082.56కోట్ల అంచనాలతో కేంద్రం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. తొలివిడతగా రూ.436 కోట్లను జాతీయ రహదారుల, రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కారీ నిధులను మంజూరు చేశారు. 30నెలల్లో ఐకానిక్ వంతెన నిర్మాణం పూర్తి చేపడతామని ప్రకటించారు. కానీ రెండేళ్లు కావస్తున్నా.. ఇంతవరకు ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి ఒక్క అడుగు పడలేదు.

తెలంగాణ, ఆంధ్రా సరిహద్దుల్లోని ఈ కొండలను కలుపుతూ నిర్మాణం కానున్న ఐకానిక్ బ్రిడ్జి







కృష్ణానది వంతెనకు వేసిన శిలాఫలకం ఇదే

- రెండేళ్ల క్రితమే రూ.436 కోట్లు మంజూరు చేసిన కేంద్రం
- 30 నెలల్లో పనులు ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి ఆర్భాట ప్రకటన
- ఇప్పటి వరకు పునాదికి నోచుకోని వైనం

వంతెన ప్రస్తావన ఎప్పుడు వచ్చింది?

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణానదికి ఇరువైపుల కర్నూలు - మహబూబ్‌నగర్ జిల్లాల గ్రామాల ప్రజల మధ్య బంధుత్వాలు ఉన్నాయి. కృష్ణానది మీద పడవల్లో రాకపోకలు సాగించేవారు. ఈ క్రమంలోనే పలుమార్లు పడవ ప్రమాదాలు సంభవించాయి. అయితే 2007 జనవరి 18వ తేదిన మహబూబ్‌నగర్ జిల్లా సోమశిల సమీపంలో ఉన్న సింగోటం నరసింహస్వామి జాతరకు నందికొట్కూరు తాలుకాలోని నెహ్రూనగర్ గ్రామం నుంచి సుమారు 63 మంది ప్రయాణికులు నాటు పడవపై కృష్ణానదిపై ఆవలి తీరానికి బయలుదేరారు. పడవలో పరిమితికి మించి ప్రయాణికుల సంఖ్య ఉండటంతో పడవ కృష్ణా నదిలో మునిగిపోయింది. 63 మంది జలసమాధయ్యారు. ఈ సంఘటన అప్పట్లో రాష్ట్రాన్నే కుదిపివేసింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఘటనా.. స్థలికి చేరుకుని బాధితులను ఓదార్చారు. పడవ ప్రమాదాలను నియంత్రించడానికి సిద్ధేశ్వరంపై వంతెన నిర్మాణాన్ని చేపడతామని హామీ ఇచ్చారు. ఇందుకోసం 2007-08 వార్షిక బడ్జెట్‌లో రూ.110 కోట్ల నిధులను కూడా విడుదల చేశారు. ఆ తర్వాత వైఎస్ఆర్ మృతిచెందడం, ఆపై రాష్ట్రంలో చోటుచేసుకున్న పరిణామాలతో ప్రక్రియ ముందుకు సాగలేదు. ఆ తర్వాత సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయంలో 2011-12 బడ్జెట్‌లో రూ.280కోట్లతో మరోసారి సిద్ధేశ్వరం వంతెన నిధుల కేటాయింపు చేసినప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. కాగా తెలంగాణ ప్రభుత్వం 2014 నవంబర్‌లో జీవోనెం.131 కింద సిద్ధేశ్వరం వంతెన నిర్మాణానికి రూ.193కోట్లు కేటాయించినప్పటికీ నిర్మాణ ప్రక్రియ జరగలేదు. ఆ తర్వాత 2020లో కల్వకుర్తి - నంద్యాలను అనుసంధానిస్తూ రూ.800కోట్లతో 167కే జాతీయ రహదారి నిర్మాణం నిర్మించడంతో పాటు అందులో భాగంగానే కృష్ణానదిపె ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకోసం రెండేళ్ల క్రితం రూ.1082.56కోట్ల ప్రతిపాదనలతో ఆమోదం పొందగా 2022 నవంబరు 24వ తేదిన తొలివిడతగా రూ.436కోట్లను మంజూరు చేసినప్పటికీ ఇప్పటివరకు బ్రిడ్జి పనులు మొదలేకాలేదు.

మిగతా 6లో..

ప్రతిభకు అంగవైకల్యం అడ్డుకాదు

కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతిభకు అంగవైకల్యం అడ్డుకాదని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. మంగళవారం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన ర్యాలీని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ అధికారి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 65వ అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1992 సంవత్సరంలో యునైటెడ్ నేషెన్స్ ఆర్గనైజేషన్స్ (యుఎన్‌వో) తీర్మానం మేరకు ప్రతి సంవత్సరం డిసెంబరు 3న అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఈ ఏడాది 'సమగ్రమైన స్థిరమైన భవిష్యత్తు కోసం వైకల్యాలున్న వ్యక్తుల నాయకత్వాన్ని విస్తరించడం' అనే థీమ్‌తో ఈ వేడుకలు జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రతిభను అంగవైకల్యం అడ్డుకోలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 31,069 మంది వికలాంగులకు నెలకు రూ.6 వేల చొప్పున రూ.18.96 కోట్ల పింఛన్‌ను అందజేస్తున్నామన్నారు. అదేవిధంగా అవసరం ఉన్న వారికి ట్రైసైకిళ్లను, హియరింగ్ ఎయిడ్స్ తదితర పరికరాలను కూడా అందజేస్తున్నామని తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల కోసం నగరంలో నిర్మిస్తున్న వసతి గృహం దాదాపు 80 శాతం పూర్తయిందన్నారు. 17 బ్యాక్‌లాగ్ పోస్టుల ఖాళీలు గుర్తించామని, ఈ ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. విభిన్న ప్రతిభావంతుల్లో ఉత్తమ సేవలు అందజేసిన ఉద్యోగులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సీపీవో హిమప్రభాకర్ రాజు, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ అధికారి రయిూస్ ఫాతిమా, డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ నాగ శివలీల, డీఎస్‌వో రాజా రఘువీర్, విభిన్న ప్రతిభావంతుల అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

పూర్తిగాని పునరావాసం

- 2008లో కొత్తచెర్లోపల్లె గ్రామ నిర్మాణం
- పొలాలకు వెళ్లే రస్తాలు లేక 200 ఎకరాలు బీడు
- వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యం

6

నీటి సంఘాల ఎన్నికలు మళ్లీ వాయిదా!

- ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కష్టాల్లో రైతులు
- ఈ సమయంలో ఎన్నికలు వద్దని మంత్రివర్గం నిర్ణయం

7

ఎంత కష్టం... ఎంత నష్టం..!

నేలవాలిన వరి..
కాపాడుకునేందుకు రైతుల పాట్లు


మునకకు గురైన పాత చెర్లోపల్లె గ్రామం

పూర్తిగాని పునరావాసం

అవుకు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల జిల్లా అవుకు మండలంలోని కొత్త చెర్లోపల్లె పునరావాస గ్రామం. అవుకు రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా పాత చెర్లోపల్లె మునకకు గురైంది. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం పునరావాస గ్రామం ఏర్పాటు కోసం రామాపురం సమీపంలో 80 ఎకరాల భూమిని కేటాయించింది. 909 కుటుంబాలను లబ్ధిదారులుగా గుర్తించి ఇళ్ల నిర్మాణం కోసం ఐదు సెంట్ల స్థలం, రూ.75 వేల నగదు అందించింది. 2008లో పునరావాస గ్రామం ఏర్పాటైంది. ఇప్పటికి16 సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ 53 మంది లబ్ధిదారులకు పునరావాసం అందలేదు. మరో 25 మందికి ఇళ్లు కట్టుకునేందుకు రూ.75 వేల పరిహారం కూ డా రాలేదు. దీంతో ప్రభుత్వం కేటాయించిన ఐదు సెంట్ల స్థలం కబ్జాకు గురికాకుండా సొంత డబ్బులు వెచ్చించి బేస్ మట్టం వరకు నిర్మించుకున్నారు. ఆర్థిక స్థోమత లేక వదిలేశారు. బుగ్గ పొలాలు, చాకలోల్ల మెట్ట పొలాలని పిలిచే 400 ఎకరాలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించలేదు. ఈ వ్యవసాయ భూముల వద్దకు చేరుకునే పరిస్థితి లేక 200 ఎకరాలు బీడు భూములుగా మారాయి. దాదాపు 60 మంది రైతులు జీవనోపాధి కోల్పోయారు. పునరావాస గ్రామంలో 2,533 మంది జనాభా ఉండగా 2150 మంది ఓటర్లు ఉన్నారు. ఇప్పటికీ గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీతో పాటు కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదు. గ్రామాధిపత్యం కోసం రెండు వర్గాల మధ్య జరుగుతున్న పోరులో గ్రామం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. వైసీపీ ఐదేళ్లపాలనలో గ్రామం ఎలాంటి అబివృద్ధికి నోచుకోలేదు. పరిహారం కోసం పాలకులు, అధికారులకు విన్నవించుకున్నా ఫలితం కనిపించటం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- 2008లో కొత్తచెర్లోపల్లె గ్రామ నిర్మాణం
- ఇప్పటికీ 53 మంది లబ్ధిదారులకు అందని ఇళ్లు
- పొలాలకు వెళ్లే రస్తాలు లేక 200 ఎకరాలు బీడు
- వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యం
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు

కనీస మౌలిక సదుపాయాలు కరువు

కొత్త చెర్లోపల్లె గ్రామంలో ఇప్పటికీ కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో టీడీపీ పాలనలో వేసిన రోడ్లు తప్ప ఎలాంటి పురోగతి లేదు. వైసీపీ పాలనలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. డ్రైనేజీ వ్యవస్థ లేక వర్షం పడితే వీధులు బురదమయంగా మారి ప్రజలు రోగాల బారిన పడాల్సి వస్తుంది. తాగునీటి పైపులైన్లు లీకేజీ అవుతూ కలుషిత నీరు సరఫరా అవుతోంది. వీధి దీపాలు అలంకారప్రాయంగా మారాయి. ఇప్పటికైనా పాలకులు, జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి గ్రామంలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించి, లబ్ధిదారులకు పునరావాసం, పరిహారం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

గతంలో వ్యవసాయంతో గ్రామం కళకళ

గతంలో పాత చెర్లోపల్లె గ్రామంలోని ప్రజలు వ్యవసాయంతో పాటు మైనింగ్, నాపరాతి పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ఆనందంగా జీవనం సాగించేవారు. అప్పటి గ్రామంలో 1200 ఎకరాలు వ్యవసాయ భూములు ఉండగా వంద ఎకరాల్లో మైనింగ్, 36 నాపరాతి పరిశ్రమలు ఉండేవి. రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా 800 ఎకరాలు వ్యవసాయ భూములు, నాపరాతి పరిశ్రమలు, మైనింగ్ భూములు మునకకు గురై తుడిచిపెట్టుకపోయాయి. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లింపులో భాగంగా గ్రామ పరిధిలోని మడవమల్లు పొలాలు 150 ఎకరాలు, ఎకరం రూ.12 వేలు, రామలింగమఠం సమీపంలోని 150 ఎకరాలు ఎకరం రూ.18 వేలు, రిజర్వాయర్ కట్ట మట్టి కోసం 200 ఎకరాలు ఎకరం రూ. 32 వేలు, బావుల కింద సాగవుతున్న 300 ఎకరాలు తోట పొలాలు ఎకరం రూ. 1.40 లక్షల ప్రకారం రైతులకు చెల్లించింది. ఇక నాపరాతి పరిశ్రమల విషయానికొస్తే 36 నాపరాతి పరిశ్రమల్లో ఉండే యంత్ర సామగ్రి, నిర్మాణాన్ని బట్టి ఒక్కొక్క పరిశ్రమ యజమానికి రూ.8 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు ఆనాటి టీడీపీ ప్రభుత్వం చెల్లించింది. మైనింగ్ భూములు ప్రభుత్వం అధీనంలోనే ఉండటంతో ఎవరికీ డబ్బులు చెల్లించలేదు.

పునరావాస గ్రామం ఏర్పాటు ఇలా..

గతంలో రిజర్వాయర్‌లో అంతర్భాగమైన తిమ్మరాజు చెరువు సమీపంలో పాత చెర్లోపల్లె గ్రామం ఉండేది. అవుకు రిజర్వాయర్ 1.86 టీఎంసీల నుంచి 4.148 టీఎంసీల నీటి సామర్థ్యంతో నిర్మాణం కావటంతో పాత చెర్లోపల్లె గ్రామం మునకకు గురికాక తప్పలేదు. అప్పటి టీడీపీ ప్రభుత్వం పునరావాస గ్రామానికి శ్రీకారం చుట్టింది. ఒక్కో కుటుంబానికి ఐదు సెంట్ల స్థలం, రూ. 75 వేలు నగదు అందించింది. అనంతరం జరిగిన ఎన్నికల్లో 2009లో కాంగ్రెస్ అధికారంలోకి రావటంతో పునరావాసం లబ్ధిదారులకు అందించే పరిహారంలో పలు అక్రమాలు చోటుచేసుకున్నాయి. దోచుకున్న వాళ్లకు దోచుకున్నంత అన్న విధంగా అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామంలోని బడానాయకులు చేతులు కలిపి ఇష్టానుసారంగా ప్రభుత్వం నుంచి పరిహారం పొందారు. సామాన్య, మధ్యతరగతి లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోయారు. ఈ విధంగా 2008లోనే పునరావాస గ్రామం ఏర్పాటైంది. ప్రస్తుతం కొత్త చెర్లోపల్లె గ్రామంలోని ప్రజలు ఎక్కువ శాతం మైనింగ్ గనులు, నాపరాతి పరిశ్రమలను ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందిచారే తప్ప జీవనం కోసం సాగు పొలాలను ఎక్కడా చూపలేదు. పొలాలకు వెళ్లే రహదారులు లేక 200 ఎకరాలు బీళ్లుగా మారిపోయాయి. మిగిలిన 200 ఎకరాల్లో మాత్రమే రైతులు పంటలను సాగు చేసుకుంటున్నారు. గతంలో పాత చెర్లోపల్లెలో ప్రభుత్వానికి డబ్బులు చెల్లించకుండానే మైనింగ్ గనులు చేసుకునేవారు. అప్పట్లో నాపరాతికి బాగా డిమాండ్ ఉండటంతో డబ్బులు సంపాదించారు. కొత్త చెర్లోపల్లె గ్రామం ఏర్పడిన తరువాత మైనింగ్ గనుల కోసం ప్రభుత్వానికి డబ్బులు చెల్లించి రెవెన్యూ కార్యాలయం నుంచి ఎన్‌ఓసీ తీసుకోవాల్సి వస్తుంది. ఇపుడు నాపరాతికి డిమాండ్ పడిపోవటంతో మైనింగ్ గనులతో గిట్టుబాటు కావటం లేదు, ఇప్పటితో పోలిస్తే పాత చెర్లోపల్లెలోనే జీవనం హాయిగా, సజావుగా ఉండేదని ప్రజలు పేర్కొంటున్నారు.


పరిహారం అందక బేస్‌మట్టానికే పరిమితమైన ఇంటి నిర్మాణం


బీడుగా మారిన భూములను చూపుతున్న రైతులు

పునరావాసం అందలేదు



కొత్త చెర్లోపల్లె గ్రామం ఏర్పాటై 16 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పునరావాసం అందలేదు. నాకు కేటాయించిన ఇంటి స్థలం చూపాలని అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. గ్రామంలో పునరావాసం అందని లబ్ధిదారులు 53 మంది ఉన్నారు. సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు న్యాయం జరిగే పరిస్థితి లేదు.
- నాగవేణి, కొత్త చెర్లోపల్లె గ్రామం

200 ఎకరాలు బీడు భూములుగా మారాయి



పాత చెర్లోపల్లె పరిధిలో నాకు ఐదు ఎకరాల పొలం ఉంది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అవసరం లేదని 400 ఎకరాలు భూములను కొనలేదు. పొలాల వద్దకు వెళ్లే రహదారులు లేక 200 ఎకరాలు బీడు భూములుగా మారాయి. ప్రభుత్వం పొలాల వద్దకు వెళ్లేందుకు రహదారులు ఏర్పాటు చేయకపోతే మా భూములను ప్రభుత్వం కొని పరిహారం చెల్లించాలి.
-రామమద్దయ్య, రైతు, కొత్త చెర్లోపల్లె

బేస్‌మట్టాలకే పరిమితమయ్యాం



పేరుకే పునరావాస గ్రామం. అప్పట్లో అధికారులు పునరావాసం కింద ఐదు సెంట్ల స్థలం మాత్రమే ఇచ్చారు. ఇళ్లు కట్టుకునేందుకు పరిహారం ఇవ్వలేదు. ఇళ్లు నిర్మించుకునే స్థోమత లేక స్థలం కబ్జాకు గురి కాకుండా బేస్‌మట్టాలు వేసి వదిలేశాం. ఇప్పటికీ 25 మందికి ఇళ్లు కట్టుకునేందుకు పరిహారం అందలేదు. పునరావాస గ్రామంలో అన్నీ సమస్యలే
-షేక్ హుసేన్‌వలి, కొత్త చెర్లోపల్లె గ్రామం

యువతకు అన్యాయం చేసిన కేంద్రం: ఏఐవైసీ



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నాయకులు

కర్నూలు అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం వచ్చాక యువతకు తీవ్ర అన్యాయం జరిగిందని అఖిల భారత యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు అన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి మమతా నాగిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మురళీకృష్ణతో కలిసి ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసి రైతన్నలను అప్పుల పాలు చేసిన ఘనత బీజేపీకే దక్కిందన్నారు. ఉన్న పరిశ్రమలను ప్రైవేట్ పరం చేస్తూ అదానీ, అంబానీ కుటుంబాలకు ఊడిగం చేస్తోందని ఆరోపించారు. విద్యుత్ ఒప్పందంలో వేల కోట్ల అవినీతికి పాల్పడిన అదానీ, జగన్‌పై ఇప్పటికి చర్యలు ఎందుకు తీసుకోలేక పోతున్నారని ప్రశ్నించారు. మమతా నాగిరెడ్డి మాట్లాడుతూ కులాలు, మతాల పేరుతో బీజేపీ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలో మొక్కలు నాటారు. మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, పార్టీ నగర అధ్యక్షుడు జీలానీ బాషా, ఎం.ఖాశీం వలి, బి.బ్రతుకన్న, తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలను ఈటీపీ ప్లాంట్ ద్వారా శుద్ధి చేయండి: డీఏవో

నంద్యాల రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి); పత్తి విత్తనశుద్ధి కేంద్రాల ద్వారా వచ్చే వ్యర్థాలను ఈటీపీ ద్వారా శుద్ధి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ ఆదేశించారు. నంద్యాల పట్టణ శివారులోని శ్రావణలక్ష్మి పత్తిసీడ్స్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయశాఖ అనుమతి పొందిన విత్తనాలను మాత్రమే ప్రాసెసింగ్ చేయాలని సూచించారు. కంపెనీ నుండి వచ్చిన విత్తనాలు తిరిగి కంపెనీకి పంపించేటప్పుడు రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. డీఏవో వెంట మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావ్ ఉన్నారు.

సంక్షేమం సిగ్గుపడాల్సిందే

(5వ పేజీ తరువాయి)

వాచ్‌మెన్, వార్డెన్లు లేరు



రాత్రి 10.30 గంటల సమయంలో కూడా తెరిచి ఉన్న ఇంటిగ్రేటెడ్ హాస్టల్

కోసిగి: కోసిగిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కు ఆంధ్రజ్యోతి విజిట్‌లో భాగంగా సోమవారం రాత్రి 10.30 గంటల సమయంలో వెళ్లితే.. అప్పటికీ హాస్టల్ ప్రధాన గేటు తెరిచి ఉంది. నైట్‌వాచ్‌మెన్ మెడికల్ లీవ్‌లో ఉన్నాడు. వార్డెన్ అందుబాటులో లేడు. హాస్టల్‌లో ఓ బైటి వ్యక్తి కూడా నిద్రపోతున్నాడు. కొందరు విద్యార్థులకు దుప్పట్లు లేక చలికి వణుకుతున్నారు. ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో 5 నుంచి 10వ తరగతి వరకు 400 మందికిగాను 210 మంది ఉంటున్నారు. సోమవారం 80 మంది విద్యార్థులు ఉన్నారు. వార్డెన్‌కు ఫోన్ చేయగా.. తాను ఆదోనిలో ఉన్నట్లు తెలిపారు. హాస్టల్‌కు కిటికీలు లేకపోవడంతో చల్లటి ఈదురుగాలులకు విద్యార్థులు చలికి వణుకిపోతున్నారు.

అరకొర వసతులే


పత్తికొండ ఎస్సీ హాస్టల్‌లో నిద్రిస్తున్న విద్యార్థులు

పత్తికొండ: పట్టణంలోని ఎస్సీ-2 బాలుర హాస్టల్‌ను మంగళవారం రాత్రి ఆంధ్రజ్యోతి విజిట్ చేసింది. ఈ హాస్టల్‌లో విద్యార్థులు 90 ఉండాలి. కానీ విజిట్ సమయంలో 80 మంది ఉన్నారు. ప్రభుత్వం ఇచ్చిన బెడ్‌షీట్లు వార్డెన్ అందించారని విద్యార్థులు తెలిపారు. అయితే బెడ్‌షీట్లు నాసిగా ఉన్నాయని, చలికి తట్టుకోవడం కష్టంగా ఉందని విద్యార్థులు అన్నారు.

అన్నీ అసౌకర్యాలే..


ఒక గదిలో 15 మందికి పైగా విద్యార్థులు నిద్రిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు: పట్టణంలోని ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులు తీవ్రమవుతున్న చలిలో అసౌకర్యాలతో రాత్రిళ్లు నిద్రపోతున్నారు. అద్దె భవనాల్లో హాస్టళ్లు నడుస్తుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీసీ సంక్షేమ వసతిగృహం పట్టణంలోని గుడికల్ రోడ్డులోని ఓ ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్నారు. 190మంది విద్యార్థులు ఇందులో ఉంటున్నారు. సోమవారం రాత్రి ఆంధ్రజ్యోతి పరిశీలనకు వెళ్లినప్పుడు 170 మంది విద్యార్థులు హాస్టల్‌లో ఉన్నారు. వీరికి దుప్పట్లు ఇచ్చారే తప్ప కింద పరుచుకొనేందుకు అవసరమైన జంఖానాలు ఇవ్వలేదు. వాటిని విద్యార్థులు ఇండ్ల నుంచి తెచ్చుకున్నారు. ఒక్కో గదిలో దాదాపు 15మంది విద్యార్థులు పడుకుంటున్నారు. ఓ గది ఐరన్ గ్రిల్‌కు తలుపులు లేవు. దీంతో విద్యార్థులు చలికి ఒణికిపోతున్నారు. దీనికితోడు గదులు సరిగాలేవు. బాత్‌రూంలకు తలుపులు లేవు. వాటి ముందుభాగంలో మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది.

12న సర్టిఫికెట్ల పరిశీలన

కర్నూలు రూరల్ డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో ఏపీఎస్ ఆర్టీసీ అంప్రెటిస్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్న ఐటీఐ అభ్యర్థులకు ఈ నెల 12వ తేదీన వారి సర్టిఫికెట్లను పరిశీలించనున్న ట్లు కర్నూలు జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ నజీర్ అహమ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీజిల్ మెకానిక్ ట్రేడ్ అభ్యర్థులకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ధృవపత్రాలు పరిశీలించనున్నట్లు వివరించారు. అంతేకాకుండా మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, ఫిట్టర్, డ్రాఫర్స్‌మెన్(సివిల్) అభ్యర్థులకు మాత్రం అదే రోజు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటుందని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు కార్యాలయానికి సంబంధించిన 08518-257025 అనే నెంబరుకు ఫోన్ చేసి కనుక్కోవాలని నజీర్ అహమ్మద్ సూచించారు.

అడుగుపడని ఐకానిక్


(5వ పేజీ తరువాయి)

ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణంలో ప్రత్యేకతలు

కృష్ణానదిపై 800మీటర్ల ఐకానిక్ సస్పెన్షనబుల్ కేబుల్ బ్రిడ్జి ప్రపంచంలోనే రెండవదిగా, దేశంలోనే తొలి చారిత్రాత్మకంగా వంతెనగా గుర్తింపు దక్కించుకోనుంది. ఈ వంతెన డబుల్ డెక్కర్‌లో నిర్మించనున్నారు. ఇందులో ఎగువన రోడ్డు నిర్మాణంపై వాహనాలు వెళ్లనున్నాయి. దిగువన గాజు బ్రిడ్జి మీదుగా పాదచారులు కృష్ణానదిని, నల్లమల అటవీ అందాలను వీక్షిస్తూ నడిచేలా ఈ వంతెనను రూపొందిస్తున్నారు. గాజు వంతెనపై అక్కడక్కడా పర్యాటకులు కూచొని విశ్రాంతి తీసుకునే వెసులుబాటు కల్పించనున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా ఈ బ్రిడ్జి నిర్మాణాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కేంద్ర ప్రభుత్వ ఆలోచన. అలాగే ఈ వంతెన గోపురం ఆకారంలో పైలాన్ నిర్మాణ రూపంలో ఉంటుంది. దీనికిఅద్భుతమైన లైటింగ్ వ్యవస్థను సమకూర్చనున్నారు.

ఐకానిక్ వంతెన నిర్మాణంతో ఇరు ప్రాంతాల అభివృద్ధి

- కృష్ణానదిపై వంతెన నిర్మాణం పూర్తయితే తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలు పర్యాటకంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. వంతెన నిర్మాణంతో కొల్లాపురం
- నంద్యాల హైవే ఏర్పాటు జరిగితే సీమ జిల్లాల నుంచి హైద్రాబాద్ చేరుకునేందుకు దాదాపు 70కిమీల ప్రయాణ దూరం తగ్గుతోంది. దీంతో ఇంధనం సమకూరి ప్రజలపై ప్రయాణ ఖర్చుల భారం తగ్గనుంది.
- కృష్ణానదిపై చేపలవేటకు కోస్తా ప్రాంతానికి చెందిన కాకినాడ, వైజాక్, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి వందల కుటుంబాలు ఇక్కడికి ఏటా వలస వస్తుంటారు. వంతెన నిర్మాణంతో మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు.
- వంతెన నిర్మాణంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన సంగమేశ్వరం, కొలనుభారతి, అహోబిలం, మహానందితో పాటు మరికొన్ని క్షేత్రాలు అలాగే మహబూబ్‌నగర్ జిల్లాలోని అలంపూర్, సింగోటం తదితర క్షేత్రాలు కూడా అభివృద్ధి జరిగే అవకాశాలు ఉన్నాయి.
- కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాల ప్రజల మధ్య బంధుత్వాలు వున్నాయి. వంతెన నిర్మాణం జరగకపోతే వారు పడవలను ఆశ్రయించి ప్రమాదాలు కొనితెచ్చుకోవాల్సిన పరిస్థితి తప్పదు. వంతెన నిర్మాణం జరిగితే ఇరు ప్రాంతాల వారు మరింత బంధుత్వాన్ని పెంచుకుంటారు.


తెలంగాణ, ఆంధ్రా సరిహద్దుల్లోని ఈ కొండలను కలుపుతూ నిర్మాణం కానున్న ఐకానిక్ బ్రిడ్జి


కృష్ణానదిపై సుందరంగా రూపుదిద్దుకోనున్న ఎన్‌హెచ్-167కే బ్రిడ్జి నమూనా

హైద్రాబాద్ నుంచి నంద్యాలకు తగ్గనున్న 70 కి.మీ. దూరం

ఈ ఐకానిక్ బ్రిడ్జి పూర్తయితే హైద్రాబాద్ నుంచి నంద్యాలకు 70కిమీల ప్రయాణదూరం తగ్గనుంది. ఎన్‌హెచ్-44, ఎన్‌హెచ్-40 జాతీయ రహదారుల మీద సాగుతున్న ప్రయాణం ఎన్‌హెచ్ 167కే జాతీయ రహదారి మీదుగా హైద్రాబాద్ నుంచి నంద్యాల చేరుకునే వెసులుబాటు కలుగుతుంది. కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు 170కిమీల దూరం వున్న ఎన్‌హెచ్ 167కే రహదారి కల్వకుర్తి నుంచి కొల్లాపూర్ వరకు 79కిమీలు రెండు లైన్లలో, అక్కడి నుంచి సుమారు 90కిమీలు నాలుగులైన్లలో నిర్మించాలని నిర్ణయించారు. ఈ బ్రిడ్జి నిర్మాణ పనులను అప్పట్లో తెలంగాణ జాతీయ రహదారుల శాఖకు అప్పగించారు.

2028 కృష్ణా పుష్కరాల్లోగా పూర్తి కావాలని ఆశిస్తున్నా




2028లో జరిగే కృష్ణా పుష్కరాల సమయానికి కృష్ణానదిపై ఐకానిక్ వంతెన నిర్మాణం పూర్తి కావాలని ఆశిస్తున్నా. ఇదే జరిగితే సంగమేశ్వర క్షేత్రం ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందనుంది.
-తెలకపల్లి రఘురామశర్మ, పురోహితుడు, సంగమేశ్వర క్షేత్రం

వంతెన నిర్మాణంతో ఉపాధి అవకాశాలు



కృష్ణానదిపై వంతెన నిర్మాణం జరిగితే ఇరు ప్రాంతాల్లో వాణిజ్యపరంగా, పారిశ్రామికంగా అభివృద్ధి జరిగి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. పుట్టి ప్రమాదాలు నివారించవచ్చు. కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన వంతెన నిర్మాణంతో పాటు జాతీయ రహదారిని నిర్మించాలి.
- సుధాకర్, జానాల గూడెం, కొత్తపల్లి మండలం

విస్తృతంగా తనిఖీ చేయండి


డీఎస్‌వోతో మాట్లాడుతున్న సివిల్ సప్లయిస్ డైరెక్టర్

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ కొంకతి లక్ష్మీనారాయణ అధికారులను ఆదేశించారు. మంగళవారం డీఎస్‌ఓ, జిల్లా సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సివిల్ సప్లయిస్ డైరెక్టర్ మాట్లాడుతూ రేషన్ మాఫియాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందన్నారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'మెరుగైన సౌకర్యాలే లక్ష్యం'


పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఉపకులపతి

కర్నూలు అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన క్యాంపస్, ప్లేస్‌మెంట్లు లభించే విధంగా కృషి చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలో వివిధ విభాగాలను రిజిస్ట్రార్ బోయ విజయకుమార్‌తో కలిసి పరిశీలించారు. వర్సిటీలోని కెరియర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ విభాగాన్ని సందర్శించారు. 2023-24 విద్యా సంవత్సరంలో కరూర్ వైశ్యబ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, ఎసాఫ్‌బ్యాంక్, టాటా గ్రూప్, కేవీనేకర్, రైనెక్స్ టెక్నాలజీస్, క్యూస్పైడర్ తదితర 11 సంస్థల్లో 59 మంది విద్యార్థులు అవకాశాలను పొందారని తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో మూడు సంస్థల్లో 23 మంది ఉద్యోగాలు పొందారన్నారు. అనంతరం హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించాలని వార్డెన్లకు సూచించారు. వార్డెన్స్, డిప్యూటీ వార్డెన్స్ విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు.

న్యాయాధికారిగా నంద్యాల పూర్వ విద్యార్థి


విద్యార్థిని అభినందిస్తున్న అప్పారావు

నంద్యాల, డిసెంబరు 3 : (ఆంధ్రజ్యోతి): రావూస్ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థి షేక్ ఖాజా రెహమాన్ న్యాయాధికారిగా ఎంపిక కావడంతో కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. మంగళవారం కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. చైర్మన్ ఏఎంవీ అప్పారావు మాట్లాడుతూ 2012-2014 సీఈసీ బ్యాచ్‌కు చెందిన ఖాజా రెహమాన్ ఇంటర్‌లో జిల్లా టాపర్‌గా నిలిచి సీఏ పూర్తి చేశారని, అనంతరం ఉస్మానియా కళాశాలలో న్యాయ విద్యను అభ్యసించి హైకోర్టులో మూడేళ్ల న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారని చెప్పారు. ఇటీవలే హైకోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి నియామక పరీక్ష రాసి విజయం సాధించడం ఆనందంగా ఉందన్నారు. తమ కళాశాల పూర్వ విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్‌కు ఎంపిక అవడమే కాకుండా ప్రభుత్వ ఉన్నత రంగాల్లో స్థిరపడ్డారని గుర్తు చేశారు. షేక్ ఖాజా రెహమాన్‌ను అప్పారావు, డైరెక్టర్ మోనిచంద్ర, ప్రిన్సిపాల్ సుంకయ్య అభినందించారు.

మానసిక దివ్యాంగులకూ హక్కులు

- జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది

కర్నూలు లీగల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మానసిక దివ్యాంగుల కోసం పలు చట్టాలు ఉన్నాయని.. వాటిని సద్వినియోగం చేసుకుని సత్వర న్యాయం పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది తెలియజేశారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా మంగళవారం న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలో ఉన్న మానసిక దివ్యాంగులకు తోడ్పాటు అందించాలని కోరారు. అగ్రిసోల్ట్ ఇండియా వారి సౌజన్యంతో పదిమంది విద్యార్థులకు చెవిటి మిషన్లను జిల్లా ప్రధాన న్యాయాధికారి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి, అగ్రిసోల్ట్ ఇండియా కంపెనీ అధికారులు నారాయణరెడ్డి, షణ్ముకసాయి, సురేంద్రనాథ్ రెడ్డి, ఈఎన్‌టీ వైద్యులు రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వీల్ చైర్ల వితరణ: స్థానిక అంబికా శిశు కేంద్రంలో మానసిక దివ్యాంగుల అవసరార్థం ఐదు వీల్ చైర్లను జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది మంగళవారం అందజేశారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయం కోసం ఎవరైనా కానీ లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100ను ఉపయోగించుకోవాలని కోరారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, అంబికా శిశు కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

రాయల్ ఓక్ ఫర్నీచర్ షాపునకు వినియోగదారుల ఫోరం వడ్డింపు

కర్నూలు లీగల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాయల్ ఓక్ ఫర్నీచర్ షాప్‌కు వినియోగదారుల ఫోరం వడ్డించింది. వినియోగదారుడి అభ్యర్థనను ఖాతరు చేయకుండా అతను కొన్న ఒక వస్తువుకు రెండు రుణాలు చెల్లించేలా ప్రవర్తించిన రాయల్ ఓక్ ఫర్నీచర్ సంస్థకు జిల్లా వినియోగదారుల కమిషన్ ప్రెసిడెంట్ కరణం కిషోర్ కుమార్ సభ్యులు ఎన్.నారాయణరెడ్డి, నజీమా కౌసర్‌లు మంగళవారం తీర్పు చెప్పారు. స్థానిక బాలాజీ నగర్‌కు చెందిన ఎన్.శ్రీధర్‌బాబు 2022 జనవరి 11న స్థానిక రాయల్ ఓక్ సంస్థ దుకాణంలో ఒక సోఫాను రూ.64 వేలకు బజాజ్ ఫైనాన్స్ సంస్థ నుంచి వాయిదా పద్ధతిలో రుణం తీసుకుని కొనుగోలు చేశాడు. అయితే సోఫా నచ్చకపోవడంతో దాని స్థానంలో మరొక సోఫాను కొనుగోలు చేసి మొదటి రుణాన్ని రద్దు చేసి రెండో రుణం మేరకు బదిలీ చేసిన సోఫాను ఇవ్వాలని కోరారు. అందుకు అంగీకరించిన రాయల్ ఓక్ సంస్థ మొదటి సోఫా స్థానంలో రెండో సోఫాను ఇచ్చింది. అయితే.. రెండు రుణాలను ఫిర్యాది చెల్లించేలా రాయల్ ఓక్ సంస్థ బాధ్యతారాహితంగా ప్రవర్తించింది. తాను చెల్లించిన మొదటి రుణం మొత్తం వాపసు చేయాలని ఫిర్యాది కోరినా సంస్థ వాపసు చేయకపోవడంతో ఫిర్యాది జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. కేసును విచారించిన కమిషన్ ఫిర్యాది అభ్యర్థనను లెక్క చేయకుండా బాధ్యతారహితంగా ప్రవర్తించడం సేవా లోపం అవుతుందని తీర్మానించింది. దీంతో ఫిర్యాదికి రూ.64వేలను 12 శాతం వడ్డీతో వాపసు చేసి కోర్టు ఖర్చులు, నష్టపరిహారం కింద మరో రూ.30 వేలను రాయల్ ఓక్ సంస్థ చెల్లించాలని ఆదేశిస్తూ కమిషన్ తీర్పు చెప్పింది.

ఎంత కష్టం... ఎంత నష్టం..!

- మూడు రోజులుగా ఒకటే ముసురు, జల్లులు
- నేలవాలిన వరి.. కాపాడుకునేందుకు రైతుల పాట్లు
- ఇదే అదునుగా దోచుకుంటున్న మిల్లర్లు



ఈ రైతు పేరు సోలేమాన్. ఒకటిన్నర ఎకరాల్లో ఖరీఫ్‌లో వరి పంట సాగు చేశాడు. ప్రస్తుతం చేతికందిన పంటను పొలం నుంచి పెరికే పనుల్లో సమాయత్తం అవుతుండగానే మూడు రోజులుగా ముసురు జల్లులకు నేలవాలిన వరి పంటను చూసి కన్నీరు మున్నీరయ్యాడు. ఏదైతే అది జరుగుతుందని పంటను పెరికి ధాన్యాన్ని మంగళవారం సింగవరంలో ఉన్న మిల్లుకు చేర్చే క్రమంలో ధాన్యం బస్తాలు మొత్తం తడిసిపోయాయి. ఇదే అదునుగా మిల్లర్ బస్తాకు వేయి నుంచి రూ.1,500 మాత్రమే ఇస్తానని, ఇష్టమైతే అమ్ము.. లేకపోతే వెళ్లిపో అని మొహం మీదే చెప్పడంతో ఆ రైతు కన్నీటి పర్యంతమ య్యాడు. మూడు రోజులుగా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రైతులు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.


నిడ్జూరు గ్రామంలో నేలవాలిన వరి

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఫెంగల్ తుఫాన్ పుదుచ్చేరిలో తీరం దాటింది. ఈ ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వానలు రైతన్నలను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నంద్యాల, కర్నూలు జిల్లాలో భారీ వర్షాలు లేకున్నా మూడు రోజుల నుంచి జల్లులు, ముసురు తరుముకొస్తుండటంతో చేతికొచ్చిన పంటలన్నీ దెబ్బతిన్నాయి. వేలాది ఎకరాలు దెబ్బతింటున్నాయి. రైతుల పరిస్థితిని పరిశీలించేందుకు మంగళవారం కర్నూలు మండలంలోని మామిదాలపాడు, నిడ్జూరు, సింగవరం తదితర గ్రామాల్లో పర్యటించగా.. రైతుల ఆర్తనాదాలు మిన్నంటాయి. పొలాల్లోనే పంట తడిసి నేలవారిన వరిని కాపాడేందు కోసం రైతులు పడుతున్న అవస్థలు కన్నీళ్లు తెప్పించాయి. సింగవరం గ్రామానికి చెందిన సీమోన్ అనే రైతు ఓ వైపు వర్షం పడుతుండగానే ట్రాక్టరులో వరి బస్తాలను నింపుకుని గబగబ అక్కడే ఉన్న మిల్లుకు వాటిని తరలించాడు. అప్పటికే తడిసిపోయిన ధాన్యాన్ని చూసి మిల్లు యజమాని బస్తా వెయ్యి నుంచి రూ.1,500లకు కొంటానని, ఇష్టమైతే.. అమ్ము, లేకపోతే వెళ్లిపోమని మొహం మీద చెప్పడంతో ఆ రైతు దిక్కుతోచని పరిస్థితిలో ఉండిపోయాడు. మరో పది మంది దాకా రైతులు మిల్లు బయట తమ ధాన్యం బస్తాలను నిల్వ చేసి వర్షం రాకుండా తార్పాలిన్లు కప్పి రేయింబవళ్లు జాగరణ చేస్తున్నారు. సింగవరం గ్రామానికి చెందిన నాగన్న అనే మరో రైతు రెండెకరాల్లో రూ.10 వేల చొప్పున గుత్తకు తీసుకుని దాదాపు రూ.40వేలు ఖర్చు చేసి కొర్ర పంటను సాగు చేశాడు. ముసురుతోపాటు జల్లులకు కొర్ర మొత్తం నల్లగా మారి పనికి రాకుండా పోవడంతో కనీసం పశువులకైనా మేత వేసేందుకు పనికి వస్తుందని, తన ఇంటి వద్దకు చేర్చి తార్పాలిన్లు కప్పాడు. అదేవిధంగా పెంచికలపాడులో రైతులు పత్తిని అమ్ముకునేందుకు ముసురు మధ్యనే వ్యాపారుల కోసం పడిగాపులు కాస్తున్నాడు. మూడు రోజులుగా కురుస్తున్న జల్లులు, ముసురుకు పత్తిలో తేమ శాతం 12 శాతానికి మించిపోవడంతో సీసీఐ అధికారులు తాము పత్తిని కొనుగోలు చేయలేమని చెప్పడంతో మరోదారి లేక ఇంటికి తీసుకెళ్లినా పత్తి చెడిపోతుందనే భయంతో పెంచికలపాడు మిల్లులోనే ఉన్న వ్యాపారికి రూ.5 వేలకు విక్రయించారు. కొర్ర పంట పూర్తిగా దెబ్బతినడంతో రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. మామిదాలపాడు నుంచి సుంకేసుల దాకా రోడ్డు పక్కన ఎక్కడ చూసినా వరి పంట నేలకొరిగిపోయింది. చేతికందిన వడ్లను ఫైరు కోసి రైతులు రోడ్డుపక్కనే పేర్చి తార్పాలిన్లు కప్పిన దృశ్యం హృదయ విచారకంగా ఉంది. ఈ వాన తమ కొంప ముంచిందని, ఇంకా ఎంత కష్టం, నష్టాన్ని తెచ్చిపెడుతుందోనని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. ఖరీఫ్‌లో దాదాపు ఉమ్మడి జిల్లాలో నాలుగు లక్షల ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. కొర్ర పంటను పది వేల ఎకరాల్లో సాగు చేశారు. ప్రధానంగా ఈ రెండు పంటలతో పాటు మిరప, మొక్కజొన్న పంటలు కూడా ఈ తుఫాన్‌తో పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇదే పరిస్థితి మరి కొన్ని రోజులు గడిస్తే రైతులకు చేతికి ఏమీ మిగిలే పరిస్థితి కనిపించడం లేదు.

నంద్యాల జిల్లాలో విస్తృతంగా వర్షాలు


రుద్రవరం: నల్లవాగుపల్లె సమీపంలో రహదారిపై తడిచిన వరిధాన్యం

నంద్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో నంద్యాల జిల్లాలో 228.6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. డిసెంబరు నెలలో సాధారణ వర్షపాతం 7 మి.మీ. కాగా ఇప్పటికే 212 మి.మీల వర్షం కురిసింది. అత్యధికంగా అవుకు మండలంలో 16.6 మి.మీ, అత్యల్పంగా పాముల పాడు మండలంలో 1.2 మి.మీ నమోదైంది. మండలాల్లో వర్షపాతం వివరాలు.. అవుకులో 16.6 మి.మీ, బేతంచెర్లలో 14.2, గోస్పాడులో 13.2, శిరివెళ్లలో 12.6, పాణ్యం, కొత్తపల్లె, బండి ఆత్మకూరు మండలాల్లో 10.8 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. సంజామల 10.6 మి.మీ వర్షపాతం, శ్రీశైలంలో 10.4, రుద్రవ రంలో 9.2, నంద్యాలలో 8.4, ఉయ్యాలవాడ, ఆత్మకూరు మండలాల్లో 8.2 మి.మీ చొప్పున వర్షం నమోదైంది. ఆళ్లగడ్డలో 7.8 మి.మీ, కొలిమిగుండ్లలో 7.0, డొర్నిపాడులో 6.6, బనగానపల్లెలో 6.2, చాగలమర్రి, వెలుగోడు, కోవెలకుంట్ల మండలాల్లో 5.8 మి.మీ చొప్పున వర్షపాతం కురిసింది. గడివేములలో 5.2 మి.మీ వర్షపాతం, ప్యాపిలిలో 4.4, మిడ్తూరులో 3.4, డోన్‌లో 2.8, జూపాడు బంగ్లాలో 2.6, నందికొట్కూరులో 1.8, పగిడ్యాలలో 1.6, పాములపాడులో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

నీటి సంఘాల ఎన్నికలు మళ్లీ వాయిదా!

- ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కష్టాల్లో రైతులు
- ఈ సమయంలో ఎన్నికలు వద్దని మంత్రివర్గం నిర్ణయం


కర్నూలు నగరంలోని జలమండలి కార్యాలయం

కర్నూలు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలకు ముహూర్తం కుదరడం లేదు. ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలో అన్నదాతలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నికలు జరపడం సమంజసం కాదని ప్రభుత్వం భావించింది. దీంతో రెండోసారి కూడా వాయిదా వేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు తొమ్మిదేళ్ల తరువాత నీటి సంఘాల ఎన్నికలకు అక్టోబరు 21న జిల్లా కలెక్టరు నోటిఫికేషన్ జారీ చేశారు. అసెంబ్లీ సమావేశాలు కారణంగా వాయిదా వేశారు. ఈ నెల 5 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉంది. అందులో భాగంగానే జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఎన్నికల సామగ్రిని ఆయా మండలాలకు చేర్చే పనిలో నిమగ్నమయ్యారు. 5న జిల్లా కలెక్టర్లు నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంది. అయితే.. రాష్ట్రంలో ఫెంగల్ తుఫాన్ కారణంగా కల్లాల్లో పంటలు కాపాడుకోవడానికి రైతులు పడుతున్న అవస్థలు కష్టజీవుల కన్నీళ్లకే ఎరుక. అన్నదాతలకు అండగా నిలవాల్సిన సమయం ఇది. ఎన్నికలు అంటూ రాజకీయాలు చేయడం సరైంది కాదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇలాంటి సమయంలో ఎన్నికలు వాయిదా వేయడమే ఉత్తమమని మంగళవారం జరిగిన మంత్రివర్గ నిర్ణయం తీసుకుంది. దీంతో శుక్రవారం నుంచి జరగాల్సిన సాగునీటి సంఘాల ఎన్నికల హడావుడికి మళ్లీ బ్రేక్ పడింది. మళ్లీ ఎప్పుడు ఎన్నికలు నిర్వహించాలనే దానిపై త్వరలోనే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనుందని ఇంజనీరింగ్ అధికారులు పేర్కొన్నారు. మూడో సారైనా ఎన్నికలు జరుగుతాయా అంటూ పలువురు సాగునీటి నిపుణులు పేర్కొనడం కొసమెరుపు. కర్నూలు జిల్లాలో 123 సాగునీటి సంఘాలు, 10 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 2 ప్రాజెక్టు కమిటీలు, నంద్యాల జిల్లాలో 261 సాగునీటి సంఘాలు, 25 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 4 ప్రాజెక్టు కమిటీలకు పాలక వర్గాలను ఎన్నుకోవాల్సి ఉంది. కర్నూలు జిల్లాలో 123 నీటి సంఘాలకు 1,212 టీసీ (ప్రాదేశిక నియోజకవర్గం) సభ్యులు, నంద్యాల జిల్లాలో 261 సాగునీటి సంఘాలకు 2,480 టీసీ సభ్యులను రైతులు ఎన్నుకోవాల్సి ఉంది. షెడ్యూల్ ప్రకారం 5న నోటిఫికేషన్ వస్తుందని ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ఇప్పటికే ఎన్నికలకు బరిలో నిలిపే అభ్యర్థులను సన్నద్ధం చేశారు. వాయితా పడడంతో రెవెన్యూ, జలనవరుల శాఖ అధికారులతో పాటు రాజకీయ నాయకులకు కొంత ఉపశమనం లభించింది.

వాళ్లకు జీతాలు ఎలా ఇచ్చారు..?

- ఎండీయూ ఆపరేటర్ల వ్యవహారంపై నివేదిక ఇవ్వండి
- తహసీల్దారుకు జేసీ నవ్య ఆదేశం
- టీడీపీ నేతలను ఆశ్రయించిన ఆపరేటర్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆలూరు/కర్నూలు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికి వెళ్లి బియ్యం పంపిణీ చేయని ఎండీయూ వాహన ఆపరేటర్లకు నెలనెలా జీతాలు ఎలా చెల్లిస్తున్నారని జేసీ నవ్య రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని ఆలూరు తహసీల్దార్ గోవింద్‌సింగ్‌ను ఆదేశించినట్లు తెలిసింది. ఇంటింటికి రాయితీ బియ్యం సరాఫరా చేయాల్సిన ఎండీయూ వాహనాలు రోడ్డెక్కలేదు. అయినా.. రికార్డుల్లో మాత్రం పంపిణీ చేస్తున్నట్లు చూపి జీతాలు చెల్లిస్తున్నారు. కార్డుదారులు దుకాణాలకు వెళ్లి క్యూలో గంటల తరబడి నిరీక్షించి బియ్యం తీసుకుంటున్నారు. మెజార్టీ ఆపరేటర్లు వైసీపీ సానుభూతిపరులు కావడంతో.. టీడీపీ ప్రభుత్వం వచ్చాక వాహనాలు రోడ్డెక్కలేదని.. ఇంటింటికి బియ్యం పంపిణీ చేయడం లేదని తెలుస్తోంది. ఒక్కో వాహనం ఆపరేటర్, అసిస్టెంట్‌కు నెలకు రూ.26,500ల చొప్పున చెల్లిస్తూ వస్తున్నారు. ఆలూరు నియోజకవర్గంలో ఆలూరు, హొళగంద మండలాలతో పాటు మంత్రాలయం, ఎమ్మిగనూరు, పెద్దకడబూరు మండలాల్లో మెజార్టీ గ్రామాల్లో ఎండీయూ వాహనాలు తిరగడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఆలూరు మండలంలో 33 రేషన్ షాపులు ఉంటే.. 10 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. ఏడాది కాలంగా ఏ ఒక్క వాహనం కూడా రోడ్డెక్క లేదని తెలుస్తున్నది. వాహనాలు ఆపరేటర్ల ఇళ్ల ముందే నిలబడి ఉన్నాయి. టీడీపీ కూటమి వచ్చి ఆరు నెలలైనా ఎండీయూ వాహనాలకు జగన్ ఫొటో కూడా తీయలేదు. ఎండీయూ ఆపరేటర్లు కార్డుదారులకు బియ్యం బదులు కిలోకు రూ.10 లెక్కకట్టి నగదు ఇస్తూ రాయితీ బియ్యం నల్లబజారుకు తరలిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ భాగోతాన్ని 'కాయితాల్లోనే ఇంటింటికి బియ్యం' శీర్షికన వెలుగులోకి తెచ్చింది. ఈ కథనానికి స్పందించిన జేసీ రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆపరేటర్లు టీడీపీ ముఖ్య నాయకులను ఆశ్రయించారు. బియ్యం పంపిణీ చేయకుండానే జీతాలు ఎలా తీసుకుంటారని ఆ నాయకులు కూడా ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎండీయూ వాహన ఆపరేటర్ల విషయంపై రెవెన్యూ అధికారుల నుంచి నివేదిక కోరిన మాట నిజమేనని సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ రఘువీర్ ఆంధ్రజ్యోతికి వివరించారు. విచారణ చేస్తామని పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్ పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఆత్మకూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణ శివార్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో గల బావిలో కాబేతుల్లా (48) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఉన్నాయి. కొత్తపల్లి మండలంలోని దుద్యాల గ్రామానికి చెందిన కాబేతుల్లా భార్యతో పాటు తల్లిదండ్రులు కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. దీంతో ఆయన మనస్తాపానికి గురై మద్యానికి బానిసయ్యారు. ఈ క్రమంలోనే మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో గల ఓ బావిలో ఆయన మృతదేహం లభ్యమైంది. నాలుగు రోజుల క్రితం ఈ ఘటన జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా..? ఆత్మహత్యా..? అన్నది తేలాల్సి ఉంది. ఈ సంఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

కర్నూలు క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో బస్తిపాడు గ్రామంలో బోయ బజారి (50) అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. బోయ బజారికి ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లు సంతానం. ఐదెకరాల సొంత పొలంలో మల్లె, వేరుశనగ, మొక్కజొన్న, పత్తి సాగు చేస్తున్నారు. ఇటీవల వ్యవసాయంలో సరైన దిగుబడులు రాకపోవడంతో సుమా రు రూ.13 లక్షల మేర అప్పులు చేశారు. అవి ఎలా తీర్చాలోనన్న మనస్తాపంతో సోమవారం పురుగుల మందు తాగారు. బంధువులు గుర్తించి ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కోలుకోలేక మంగళవారం మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఉలిందకొండ ఎస్‌ఐ ధనుంజయ తెలిపారు.

యువకుడు..

పత్తికొండ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన బ్రహ్మయ్య (23) చికిత్స పొందుతూ మృతి చెందాడు. హోసూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుమారుడు బ్రహ్మయ్య సోమవారం తల్లి మందలించిందనే కారణంతో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

కర్నూలు క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. కల్లూరు మండలం పుసులూరులో ఆర్టీసీ బస్సు ఢీకొని గోపాలమ్మ (77) అనే వృద్ధురాలు మృతి చెందింది. గోపాలమ్మ రోడ్డుపై నిలిచి ఉండగా ఆర్టీసీ బస్సు డ్రైవర్ రివర్సులో రావడంతో ఆమె గుర్తించలేకపోయింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అల్లుడు మనోహర్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఉలిందకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే ఉలిందకొండ గ్రామంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎల్లస్వామి (20) అనే యువకుడు మృతి చెందాడు. ఉలిందకొండ గ్రామానికి చెందిన ఎల్లస్వామి నేషనల్ హైవే నిర్మాణ పనుల్లో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం విధులు ముగించుకుని గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఎల్లస్వామి గాయపడగా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎల్లస్వామి మృతికి కారణమైన డ్రైవర్ వెంకటేశ్వర్లుపై బంధువులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. బంధువుల ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ధనుంజయ తెలిపారు.

వెలుగు సిబ్బందిపై దాడి

పత్తికొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం రాత్రి ప్రభుత్వ సర్వే చేస్తున్న వెలుగు సిబ్బంది, వీఏవోలపై గతంలో పనిచేసిన ముగ్గురు వీఏవోలు దాడిచేశారు. సిబ్బంది ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. వెలుగు కార్యాలయంలో కమ్యునిటీ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న శేషప్ప, గ్రామైక్యసంఘాల వీఏవోలతో కలసి పొదుపు మహిళల వివరాలు ప్రభుత్వ యాప్‌లో నమోదుచేసే సర్వేలో భాగంగా టీచర్స్‌కాలనీలో వెంకటసాయి గ్రామైక్య సంఘ సభ్యుల ఇళ్లవద్దకు వెళ్లారు. అయితే తమ గ్రామైక్య సంఘానికి గతంలో పనిచేసిన వీఏవో పురుషోత్తం చెబితేనే వివరాలు చెబుతామని పొదుపుమహిళలు చెప్పారు. ప్రస్తుతం వారు లేరని తమకే తెలపాలన్నారు. ఆ సమయంలో అక్కడికి చేరుకున్న పురుషోత్తం, క్రిష్ణవేణి, నాగేంద్ర సిబ్బందిపై దాడికి దిగారు. నాగేంద్ర తనపైచెప్పుతో దాడిచేశాడని శేషప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశామని రూరల్ సీఐ పులిశేఖర్ తెలిపారు.

మాతృ మరణాలు జరగకూడదు: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మాతృ మరణాలు జరగకుండా ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా మెడికల్ ఆఫీసర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జూన్ నుంచి సెప్టెంబరు వరకు జరిగిన మాతృ మరణాలపై వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇకపై మాతృ మరణాలను నివారించుకోవడానికి ఇంత వరకు జరిగిన మరణాలు కేసులను స్టడీ చేసి, వాటి ఆధారంగా స్టాండర్ట్ ట్రీట్‌మెంటు ఇచ్చేందుకు ఒక ఎస్‌వోపీ తయారు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో గర్భిణులకు సంబంధించిన క్రిటికల్ కేసుల్లో తప్పనిసరిగా రాత్రి ఏసమయమైనా మెడికల్ ఆఫీసర్‌లు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలన్నారు. గర్భిణులకు 8, 9 నెలల్లో ప్రతి వారం పరీక్షలు నిర్వహించి వారు ఆరోగ్యంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఎంహెచ్‌వో డా.ఎల్. భాస్కర్, డీసీహెచ్‌ఎస్ డా. మాధవి, వైద్య సిబ్బంది ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రైల్వేలో ఎన్నికల సందడి

● నేడు, రేపు పోలింగ్, 12న కౌంటింగ్
● మొత్తం 472 మంది ఓటర్లు

కర్నూలు రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కర్నూలు సిటీ రైల్వేస్టేషన్‌లో ఎన్నికల సందడి నెలకొంది. దేశవ్యాప్తంగా ఐదేళ్లకోసారి జరిగే రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలకు ఆ శాఖలో పని చేసే ఉద్యోగ కార్మిక నాయకులు గెలుపు కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వేలో ప్రధానంగా ఐదు కార్మిక సంఘాలు బరిలోకి దిగాయి. అందులో రైల్వే ఎంప్లాయిస్ సంఘ్, మజ్దూర్ యూనియన్‌ల మధ్య పోటీ అధికంగా ఉంది. ప్రస్తుతం సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ గుర్తింపు సంఘంగా కొనసాగినట్లు తెలిసింది. బోగోలు, మానవపాడు రైల్వేస్టేషన్‌లు కర్నూలు సిటీ రైల్వేస్టేషన్ పరిధిలోకి వస్తాయి. ఈమూడు స్టేషన్‌లు కలిపి మొత్తం 472 మంది ఓటర్లు ఉన్నారు. వీరందరు నేడు, రేపు కర్నూలు రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో వారి ఓటును వినియోగించుకోనున్నారు. అంతేకాకుండా ఈనెల 6వ తేదీన రన్నింగ్ ఉద్యోగ కార్మికులు ఓటు వేసేందుకు రైల్వేశాఖ అవకాశం కల్పించింది. ఈ నెల 12న పోలింగ్ ప్రక్రియ ఉంటుందని కార్మిక సంఘాల నాయకులు చెప్పారు. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు భారీ బందోబస్తు కోసం ఆర్పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు ఆయా రైల్వేస్టేషన్‌లకు చేరుకున్నారు. హైదరాబాద్ రైల్వే డివిజన్ పరిధిలో గద్వాల, వనపర్తి, గొల్లపల్లి, కాచిగూడలో కూడ ఆప్రాంత రైల్వే ఉద్యోగ కార్మికుల కోసం పోలింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు.

పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం


నీటి తొట్లను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారులు

ఓర్వకల్లు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఏఎంవో చంద్రశేఖర్, ఎస్‌యువో కృష్ణ మోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని హుశేనాపురంలో ఓ వ్యక్తికి డెంగీ పాజిటివ్ రావడంతో ఆయన గ్రామ వీధుల్లో పర్యటించి పలు సూచనలు, సలహాలిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి ముందు ఉండే నీటి తొట్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్ర గోవర్ధనమ్మ, ఏఎన్‌ఎం స్వాతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కార్మికులకు రూ.15 వేలు ఇవ్వాలి


డీటీసీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆటో అండ్ మోటార్ డ్రైవర్ కార్మికులకు రూ.15వేలు ఇవ్వాలని రక్షణ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు యు.సుంకన్న డిమాండ్ చేశారు. మంగళవారం రవాణ శాఖ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ శాంతకు మారికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సుంకన్న మాట్లాడు తూ కూటమి ప్రభుత్వం కార్మికులకు వాహనమిత్ర తరహాలో సంవత్సరా నికి రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అయిన ఇప్పటి వరకు హామీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశులు, వెంకటేష్, మధు, రంగప్ప, మద్దిలేటి, రామక్రిష్ణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి: ఏఐఎస్ఎఫ్


ఎంఈవోకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కోడుమూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో నెల కొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం ఎంఈవో వసంత లక్ష్మికి ఆయన వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ పాఠశాలలకు ప్రహరీ లేవని అన్నారు. మరికొన్ని స్కూళ్లలో మరుగుదొడ్లు, బాత్‌రూంల సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, పదో తరగతి విద్యార్థులకు పాఠాలు చెప్పేందుకు అవసరమైన ఉపాధ్యాయులు లేరని అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వీరేంద్ర, ఆల్తాఫ్, వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను వినియోగించుకోవాలి

సి.బెళగల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జాబుకార్డు ఉన్న వారంతా ఉపాధి పనులను వినియోగించుకోవాలని ఎంపీడీవో రాణెమ్మ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏపీవో రామన్న అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో రాణెమ్మ మాట్లాడారు. ఈసమావేశంలో ఈసీ రంగస్వామి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రైతుకు ఫెంగల్ దిగులు

పంటలను కాపాడుకోవడానికి అవస్థలు


అనుగొండలో వడ్లపై కప్పిన పట్టలు


అల్లినగరం వద్ద పొగాకు తడవకుండా పట్టలు కప్పిన దృశ్యం

కోడుమూరు రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల రైతులను ఫెంగల్ తుఫాన్ కలవరపెడుతోంది. సోమవారం అర్ధరాత్రి ఓ మాదిరి వర్షం (11.4మి.మీ) కురిసింది. దీంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు. వరి, పొగాకు, పప్పుశనగ, మిరప పంట లకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఖరీఫ్‌లో సాగు చేసిన వరి కోతలు ఇపుడిపుడే ప్రారంభమయ్యాయి. మండలంలో హంద్రీ పరివాహక గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల వరకు వరి పంట వేశారు. వాతావరణం అనుకూలించడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు సంతోషపడుతున్నారు. ఈ సమయంలోనే రైతుల ఆశలు ఆవిరి అయ్యేలా తుఫాన్ వచ్చిపడింది. దీంతో కోతలు జరుపుకున్న రైతులు వడ్లు తడవకుండా పడరాని పాట్లు పడుతున్నారు. దిగుబడులపై పట్టలు కప్పి ఉంచారు. మరోవైపు యంత్రాల కొరతతో వరికోతలు ఆలస్యమవుతున్నాయి. వరి కంకులు తడిస్తే నూక శాతం పెరుగు తుందని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఇంకా కట్టెల షెడ్‌లో పొగాకు దండలు నానకుండా రైతులు టార్పాలిన్ కప్పి ఉంచారు. పొగాకు పంటలో ఆకులు కోత నిలిచిపోయింది. వర్షం పడితే ఆకుల నాణ్యత దెబ్బతింటుందని రైతులకు భయం పట్టుకుంది. అలాగే ముం దస్తుగా సాగు చేసిన పప్పుశనగ పూతదశలో ఉంది. ఈ సమయంలో వర్షంతో నష్టం తప్ప లాభం లేదని రైతులు తెలిపారు. వర్షంతో మొక్కకు ఉన్న పూత రాలిపోతుందని వాపోయారు. ఇదే జరిగితే పంట దిగు బడిపై ప్రభావం చూపుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వాములో పూత మూతబడి బూడిదరంగులో మారుతుంది. మిరపకు తెగుళ్లు సోకే ప్రమాదం ఉందని, మందులను మార్చి పిచికారీ చేయాల్సి వస్తోందని రైతులు తెలిపారు.

ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ

వివరాలను పోర్టల్‌లో నమోదు తప్పనిసరి


మాట్లాడుతున్న ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ నాగప్రసాద్

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పుట్టిన శిశువు నుంచి 5 సంవత్సరాల పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించడం వల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చునని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ నాగప్రసాద్ అన్నారు. మంగళవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓల్డ్ సీఎల్‌జీలో సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాలపై పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న క్షేత్రస్థాయి పర్యవేక్షకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి షెడ్యూల్ ప్రకారం టీకాలు ఇవ్వడం వల్ల పోలియో, కంఠసెర్పి, క్షయ, కామెర్లు, గోరంత దగ్గు, ధనుర్వాతం, నిమోనియా వంటి వ్యాధులు రాకుండా నియంత్రించవచ్చునన్నారు. జిల్లా సర్వేలెన్స్ అధికారి డా.వరుణ్ దర్శన్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల్లో పిల్లలకు టీకాలు వేస్తే ఆ వివరాలను కచ్చితంగా పోర్టల్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. శిక్షణలో ఆర్‌బీఎస్‌కే సమన్వయకర్త ఐ.హేమలత, న్యూక్లియోస్ మెడికల్ ఆఫీసర్ డా.మల్లికార్జున రెడ్డి, క్షేత్రస్థాయి పర్యవేక్షకులు, ఆరోగ్య విద్యాబోధకులు పద్మావతి, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చకపోతే సమ్మెలోకి వెళ్తాం


ఇన్‌చార్జి కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నగర పంచాయతీ ఔట్ సోర్సింగ్ సిబ్బంది

గూడూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను పరిష్కరిం చకపోతే సమ్మెలోకి వెళ్తామని నగర పంచాయతీ ఔట్ సోర్సింగ్ సిబ్బంది అయ్యగారి మధు, అరవిందు, బసవరాజు, దూకేష్, షబ్బీర్ హెచ్చరించారు. మంగళవారం గూడూరు నగర పంచాయతీ కార్యాల యంలో చైర్మన్ జె వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ కమిషనర్ కృపాకర్‌లకు నగర పంచాయతీ ఔట్ సోర్సింగ్ సిబ్బంది వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా గూడూరు నగర పంచాయతీలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన పని చేస్తున్నామని, ఇప్పటికి రూ.15వేలు జీతం మాత్రమే తీసుకుంటున్నామని అన్నారు. తమకు స్కిల్డ్ కింద రూ.24వేలు, సెమి స్కిల్డ్ కింద రూ.21వేలు జీతం ఇవ్వాలని, 15 సంవత్సరాలు పైబడి పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధు, ఖాజా హుసేన్, హుసేన్ ఖాన్, అలీ బాషా, రజాక్ పాల్గొన్నారు.

అర్థమయ్యే రీతిలో బోధించాలి: ఎంఈవో

ఓర్వకల్లు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధించాలని ఎంఈవో ఓంకార్ యాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని కన్నమడకల ఎంపీపీఎస్, జడ్పీహెచ్ఎస్ పాఠశాలలను ఆయన తనిఖీ చేసి, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుతో అధిక లాభాలు

సి.బెళగల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల సాగుతో అధిక లాభాలు ఆర్జించవచ్చునని అని కోడుమూరు ఉద్యాన వనశాఖ అధికారి మధుసూదన్‌గౌడు అన్నారు. మంగళవారం మండలంలోని బ్రాహ్మణ దొడ్డి, మారందొడ్డి, ఇనండ్ల, యలకల్లు గ్రామాలలో రైతులు సాగు చేసిన దానిమ్మ, మునగ, మామిడి, కొబ్బరి, నిమ్మ, జామ, శీను తోటలను పరిశీలించారు. ఆయన వెంట అధికారులు రాముడు, సోమేశ్వరరెడ్డి, హార్టిక ల్చర్ అసిస్టెంట్లు చెంచురాజు, భరత్, రైతులు ఉన్నారు.

నేడు ఘంటసాల జయంతి

కర్నూలు కల్చరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ నేపథ్య గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతిని బుధవారం ఉదయం 8.30 గంటలకు నగరంలో ఆయకర్ భవన్ సమీపంలోని ఘంటసాల విగ్రహం వద్ద నిర్వహిస్తున్నట్లు కర్నూలులోని పద్మశ్రీ ఘంటసాల గానకళా సమితి అధ్యక్షుడు ఎస్ వాసుదేవరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత కలెక్టర్ రాంశంకర్ నాయక్, డిప్యూటీ కలెక్టర్ పి. కొండయ్య, సీనియర్ వైద్యులు డబ్ల్యూ సీతారాం, జి.భవానీ ప్రసాద్, పి.చంద్రశేఖర్, ఉమానాథరావు, బి.శంకరశర్మ, గాడిచర్ల ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేసీ కల్కూర హాజరవుతారని ఆయన తెలిపారు.

నేడు సంగీత విభావరి: నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో బుధవారం సాయంత్రం 6 గంటలకు తెలుగు నేపథ్య గాయకుడు, దివంగత ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఒక ప్రకట నలో తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.కొండయ్య ఆధ్వర్యంలో ఘంటసాల సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సంగీత విభావరిలో పి.కొండయ్యతోపాటూ గాయకులు శ్రీనివాసులు, పద్మావతి, శ్రీదేవి, యశోద తదితరులచే అలనాటి ఘంట సాల మధుర గీతాలు ఆలపిస్తారని తెలిపారు. అనంతరం ఘంటసాల గానకళా సమితి అధ్యక్షుడు బీఎస్‌రావుకు సత్కార కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పత్తి ఓబులయ్య పేర్కొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

గూడూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గూడూరు నగర పంచాయతీ పరిధిలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టినట్లు శానిటరీ ఇన్‌స్పె క్టర్ రాఘవేంద్ర తెలిపారు. మంగళవారం గూడూరులోని ఎస్సీ కాలనీలో చేపట్టిన పారిశుధ్య పనులను చైర్మన్ జె వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి కమిష నర్ కృపాకర్ పరిశీలించారు. ఈసందర్భంగా శానిటరీ ఇన్‌స్పె క్టర్ రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తి గత పరిశుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

సీపీఐ నాయకుడికి పరామర్శ

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సీపీఐ నాయకుడు రమేష్ మంగళవారం పెరాలసిస్ స్ట్రోక్ రావడంతో ఆసుపత్రిలో చేరారు. ఈ మేరకు సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి, మల్లికార్జునలు ఆసుపత్రిలోని ఎంఎం 6 వార్డులో చికిత్స పొందుతున్న రమేష్‌ను పరామర్శించారు. వైద్య ఖర్చుల కోసం రమేష్‌కు రూ.10 వేలు అందజేశారు.

ఘనంగా బాబూ రాజేంద్రప్రసాద్ జయంతి


బాబూ రాజేంద్రప్రసాద్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ అధికారులు, ఉద్యోగులు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర గ్రంథాలయంలో భారత తొలి దేశాధ్యక్షుడు డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు బాబూ రాజేంద్ర ప్రసాద్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ గాంధీజీ దగ్గరగా సేవలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉప గ్రంథాలయ అధికారి వి. పెద్దక్క, లైబ్రేరియన్లు బాషా, వజ్రాల గోవిందరెడ్డి, గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించండి

ఓర్వకల్లు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎన్‌ఎంవో డాక్టర్ మల్లికార్జున రెడ్డి అన్నారు. మంగళ వారం మండలంలోని హుశేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ అమర్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆశా డే సమావేశాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ కుష్టు వ్యాధి, టీబీ వ్యాధుల లక్షణాలు, చిహ్నాల గురించి ఆశా వర్కర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీపీఎంవో విజయప్రకాష్, డాక్టర్ కృష్ణబాయి, ఎంపీహెచ్‌సీవో విలియం రాబర్ట్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): లింగనిర్ధారణ చట్టరీత్యానేరమని, భ్రూణ హత్యలకు పాల్పడిన వారికి ఐదేళ్ల జైలు శిక్ష, 50 వేలు జరిమానా విధిస్తారని గడ్డ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి సాత్విక హెచ్చరించారు. మంగళవారం నగరంలోని గడ్డ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆశా కార్యకర్తల సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివా సులు, వైద్యాధికారి సాత్విక మాట్లాడుతూ తల్లి గర్భవతిగా ఉన్న ప్పుడు స్కానింగ్ చేయించుకుని ఆడ శిశువు ఉందని తెలుసుకుని అబార్షన్ చేయించుకుంటున్నారని, ఇది నేరమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్ర శేఖర్ రెడ్డి, ప్రాజెక్టనిస్టు ఖలీల్, సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా స్టాంటన్ దొర జయంతి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): డాక్టర్ విలియం ఆర్థర్ స్టాంటన్ దొర జయంతి వేడుకలను నగరంలో జీసస్ సోల్జర్స్ మినిస్ట్రీస్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం వడ్డెగేరి వద్ద స్కంద కాంప్లెక్స్‌లో స్టాంటన్ దొర జయంతి సందర్భంగా జీసస్ సోల్జర్స్ మినిస్ట్రీస్, మెడికవర్ హాస్పిటల్ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా నగర పాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు హాజరై మాట్లాడుతూ స్టాంటాన్ దొర నగరంలో పలు సేవా కార్యక్రమాలు చేశారని కొనియాడారు. మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు రవికుమార్, జి.రవికుమార్, ప్రసాదరావు, ప్రవీణ్‌కు మార్, పుష్పరాజ్, మాధవరాజు, కాంతమ్మ పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణకు కృషి చేయాలి

కర్నూలు అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని క్లస్టర్ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. మంగళవారం సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని జరుపుకు న్నారు. రసాయన శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్ హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో పీవీ కిషోర్ రెడ్డి, ప్రసాదరెడ్డి, నాగరాజు శెట్టి, బాలరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయులు లేక అవస్థలు'

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు, పాణ్యం, మహానంది, నెరవాడ, బైర్లూటి, శ్రీశైలం, ఆళ్లగడ్డ, ఆలూరు, తుగ్గలి మండలాల్లో గిరిజన గురుకుల బాలుర, బాలి కల పాఠశాలలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నా రని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప అన్నారు. పొరుగు సేవల ఉపాధ్యాయులు వారిని ఒప్పంద ఉద్యోగులుగా గుర్తిం చాలని, వేతనాలు పెంచాలని కోరుతూ గత 15 రోజుల నుంచి విధులు బహిష్కరించారని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని గిరిజన గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని కోరారు.

నేడు నగరంలో ర్యాలీ

కర్నూలు కల్చరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మారణకాండకు నిరసనగా హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ నాయ కుడు గోరంట్ల రమణ తెలిపారు. ఈ ర్యాలీ బుధవారం సాయంత్రం 4 గంటలకు నగరంలోని వివేకానంద సర్కిల్ (రాజ్‌విహార్ సర్కిల్) నుంచి కలెక్టరేట్ వరకు కాగడాలతో కొనసాగుతుందన్నారు. ఈర్యాలీకి హిందువులంతా తరలిరావాలని కోరారు.

'కృష్ణయ్యను విమర్శించడం తగదు'


మాట్లాడుతున్న నక్కలమిట్ట శ్రీనివాసులు

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్యపై వ్యక్తిగతంగా విమర్శించడం తగదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు అన్నారు. మంగళవారం బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యపై అనకాపల్లికి చెందిన గురువయ్య యాదవ్ ఆర్.కృష్ణయ్య బీసీ జాతిని పణంగా పెట్టి తన రాజకీయ స్వార్థానికి వాడుకుంటున్నారని అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనకాపల్లి గురువయ్య తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాంబాబు, బోయ సంజన్న, శాలివాహన సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సుగూరు వెంకటేశ్వర్లు, మైనార్టీ నాయకులు రాష్ట్ర కార్యదర్శి అన్వర్ హుశేన్ పాల్గొన్నారు.

జీతాలు పెంచాలి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుంచి ఇంజనీరింగ్ విభా గంలోని వివిధ వృత్తులను చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం పారిశుధ్య కార్మికులకు జీతంతో పాటు హెల్త్ అలవెన్సు పెంచి రూ.21వేలు, డ్రైవర్లకు రూ.24వేలు మంజూరు చేసిం దన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో పని చేసే కార్మికులకు సేవలను ఎందుకు గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల రాష్ట్ర యూనియన్ సీడీఎంఏకు సమస్యలపై వినతిపత్రం అందజేసిందన్నారు. అనంతరం కమిషనర్ రవీంద్రబాబును కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి జే.ర మేష్, జిల్లా అధ్యక్షుడు ఎస్.మనోహర్, నగర అధ్యక్షుడు జి.వెంకటేష్, ప్రధాన కార్యదర్శి జావీద్, కే.జ్ఞానమ్మ పాల్గొన్నారు.

అశోకా కాలేజీ విద్యార్థినుల ప్రతిభ


ప్రతిభ కనబర్చిన విద్యార్థినులు

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ ఇండియా ఆఫ్కాన్-2024 పోటీల్లో కర్నూలు అశోకా ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి ఫైనల్‌కు ఎంపికయ్యారు. శ్రీనగర్ ఎన్ఐటీలో డిసెంబరు 11 నుంచి 15వ తేదీ వరకు జరగనున్న ఫైనల్స్ పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ పోటీలకు అశోకా ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన సీఎస్ఈ విద్యార్థినులు విజయలక్ష్మి, సుమాంజలి, ఈసీ ఈ విద్యార్థినులు భావన, అఖిలప్రియ, ఈఈఈ విభాగం విద్యార్థినులు నాగమల్లిక, ఉమ ఫైనల్స్‌కు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ నవీన్ తెలిపారు. కళాశాలలో మంగళవారం చైర్మన్ అశోకవర్ధన్ రెడ్డి విద్యార్థి నులను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ హరీష్ కృష్ణ, సీఎస్ఈ విభాగాధిపతి మురళీకృష్ణ, ఈసీఈ విభాగాధిపతి మాదేశ్వరి, తేజేశ్వని, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

స్కంద కాలనీలో చోరీ

కానిస్టేబుల్‌ను చూసి పరారైన యువకులు

కర్నూలు క్రైం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో జోన్ రోడ్డులో ఉన్న స్కంద కాలనీలో మూడు ఇళ్లలో చోరీ జరిగింది. ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ బాషా ఈ సంఘటనను గుర్తించారు. ఏ ఆర్ హెడ్ కానిస్టేబుల్ కలెక్టరేట్ కార్యాలయంలో గార్డ్ డ్యూటీగా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా.. స్కంద కాలనీ సమీపంలో ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని ఎవరు మీరు అని ప్రశ్నించడంతో పెట్రోల్ కోసం వచ్చామని సమాధానం ఇచ్చారు. ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ తన బైక్ దిగి వారి వద్దకు వెళ్లేలోగా ఆ ముగ్గురి రెండు బైకులను అక్కడే వదిలేసి మరో బైక్‌పై పరారయ్యారు. కానిస్టేబుల్ ఆ రెండు బైకులను స్వాధీనం చేసుకున్నారు. స్కంద కాలనీలో ఇళ్లను పరిశీలిస్తే కృష్ణ మోహన్ అనే టీచర్‌ను, సురేష్ అనే ఆర్మీ ఉద్యోగి, ఎస్.రాజు మాజీ ఆర్మీ ఉద్యోగి ఇళ్ల తలుపు తాళాలు పగల కొట్టి ఉన్నాయి. ఈ ముగ్గురు ఇంటి యజమానులు గత నెల రోజులుగా ఇళ్లకు తాళం వేసి ఉన్నారు. తాళం పగలకొట్టి ఉండటంతో హెడ్ కానిస్టేబుల్ తాలుకా పోలీసులకు సమాచారమిచ్చారు.. తాలుకా పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. దీంతో సొత్తు చోరీకి గురైన విషయాన్ని ఇళ్ల యజమానులు వచ్చిన తర్వాతనే తెలుస్తోందన్నారు.

కాల్వబుగ్గలో వేలం

ఓర్వకల్లు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వేలం పాటలు నిర్వహి స్తున్నట్లు ఈవో మద్దిలేటి మంగళవారం తెలిపారు. మూడో దుకాణం, టెంకాయ చిప్పలు పోగు చేసుకునే హక్కు కోసం వేలంపాటలు నిర్వహిస్తున్నామన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.5వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

7న క్రీడాకారుల ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఏ అవుట్ డోర్ స్టేడియంలో ఈనెల 7న ఐదో జిల్లా స్థాయి జూనియర్ జంప్ రోప్‌కు క్రీడాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి ఏసేబ్ మంగళవారం తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 01.01.2008 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 14, 15 తేదీల్లో సత్యసాయి జిల్లాలో జరిగే ఐదో రాష్ట్ర స్థాయి జూనియర్ జంప్ రోప్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

క్రీడల్లో రాణించాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో క్రీడాకారులు రాణించాలని గ్యాస్ట్రో ఎంట్రాలజీస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ అన్నారు. మంగళవారం అవుట్‌డోర్ స్టేడియంలో బాస్కెట్‌బాల్ కర్నూలు జిల్లా జట్టును ఎంపిక చేశారు. ముఖ్యఅతిథిగా గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు శంకర్‌శర్మ పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా మాటేరులో ఈనెల 7 నుంచి 10 వరకు రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో క్రీడాకారులు రాణించాలన్నారు. బాస్కెట్ బాల్ సంఘం ప్రతినిధి దాదాబాషా, సందీప్, వ్యాయామ ఉపాధ్యాయులు చిన్న సుంకన్న, ముస్తహీర్, ప్రతాప్, వలి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టని కౌన్సిలర్లు

- పరస్పర దూషణలు, వాగ్వాదాలు
- చర్చకు నోచుకోని అజెండా
- ఆదోని మున్సిపల్ కౌన్సిల్ దుస్థితి

ఆదోని పురపాలక సంఘం కౌన్సిలర్లు సమస్యలపై దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. నవంబరు 30న జరిగిన కౌన్సిల్‌లో ప్రజా సమస్యలపై చర్చించాల్సిన ప్రజా ప్రతినిధులు పరస్పర దూషణలు, ఆరోపణలు, బైఠాయింపుతో సమయాన్ని వృథా చేశారు. దీంతో కౌన్సిలర్ల తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.



పోడియం వద్ద బైఠాయించిన వైసీపీ కౌన్సిలర్లు(ఫైల్)

ఆదోని టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ జనాభా దాదాపు 2లక్షలకు పైగానే ఉంటుంది. మున్సిపాలిటీ పరిధిలో 42 వార్డులున్నాయి. ఆదోని పురపాలక సంఘంగా ఏర్పాటై 150 సంవత్సరాలకు పైగానే గడిచిపోయింది. అయితే మున్సిపల్ సమావేశాల నిర్వహణకు ఏర్పాట్లు చేసుకోవాలి. మున్సిపల్ నిబంధనల ప్రకారం ప్రతినెలా ఒకసారి సమావేశాన్ని నిర్వహించాలి. 41మంది వైసీపీ నుంచి ఎన్నికయ్యారు. ఒకరు మాత్రమే టీడీపీ తరఫున ఎన్నికయ్యారు. కాగా ఐదుగురు కౌన్సిలర్లు బీజేపీలో చేరారు.

తూతూ మంత్రంగా సమావేశాలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక జూన్‌లో నిర్వహించిన సమావేశంలో నూతన ఎమ్మెల్యే పార్థసారథి పాల్గొన్నారు. అనంతరం జూలైలో నిర్వహిచిన సమావేశానికి వైసీపీ సభ్యులు కావాలనే హాజరు కాలేదు. ఆగస్టులో సమావేశం తూతూ మంత్రంగా సాగింది. అయితే సెప్టెంబరు నెల నుంచి వైస్ చైర్మన్లు ఇద్దరికీ ప్రత్యేకంగా కాకుండా అందిరితో పాటు కుర్చీలు వేయడంతో రభస మొదలైంది.

చర్చకు రాని సమస్యలు

ఐదు నెలలుగా కౌన్సిల్ సమావేశాలు కుర్చీ కోసం కుమ్ములాటలు, పరస్పర దూషణలు, వాగ్వావాదాలతో కొనసాగడంతో సమస్యలపై చర్చకు అవకాశం లేకుండా పోయిందని పట్టణ ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, ట్రాఫిక్ ఇబ్బందులు ఇలా అనేక సమస్యలు మరుగున పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదుగురు వైసీపీ కౌన్సిలర్లు బీజేపీలో చేరి మద్దతు ప్రకటించడం, మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి మాట ప్రకారం చైర్ పర్సన్ వాల్మీకి శాంత రాజీనామా చేయక పోవడంతో వైసీపీ సభ్యులు కావాలనే సమావేశాలను జరగనివ్వడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టి సమావేశాలు హుందాగా సాగేలా చూడాలని ప్రజలు హితవు పలుకుతున్నారు.

చైర్‌పర్సన్ సీటు కోసమే గొడవ?

చైర్ పర్సన్ వైసీపీకి చెందిన వారే కావడంతో గతంలో ఏకపక్షంగా తీర్మానాలు చేసేవారు. అయితే చైర్‌పర్సన్ సీటుపై కన్నేసిన ఓ కౌన్సిలర్ ఎలాగైనా తానే చైర్మన్ కావాలన్న ఉద్దేశ్యంతో కౌన్సిలర్లను మంచి చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో మావేశాలు నిర్వహించిన ప్రతిసారీ కౌన్సిల్ హాల్ గొడవలు, దూషణలతో దద్దరిల్లుతోంది. ప్రజా సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. సమావేశాల తీరును చూసిన అధికారులు, మున్సిపల్ సిబ్బంది చూస్తూ ఉండిపోతున్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్నారు



ఎమ్మెల్యే పార్థసారథి అభివృద్ధి చేయడానికి కష్టపడుతుంటే వైసీపీ కౌన్సిలర్లు అడ్డుకుంటున్నారు. ఓ పథకం ప్రకారం ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు చెడ్డ పేరు రావడానికి ప్రయత్నిస్తున్నారు. **- వెల్లాల లలిత మధుసూదన్ శర్మ, కౌన్సిలర్**

సమావేశాలకు సహకరించాలి..



కౌన్సిలర్లు ప్రజా సమస్యలపై చర్చించేందుకు సహకరించాలి. నన్ను తొలగించడానికి జరుగుతున్న ప్రయత్నాలకు భయపడను. రభస సృష్టించి సమావేశాన్ని సాగనివ్వడం లేదని ప్రజలు గమనిస్తున్నారు. **- వాల్మీకి శాంత, చైర్‌పర్సన్**

నాణ్యమైన బియ్యం సరఫరా చేస్తాం



ఆహారాన్ని పరిశీలిస్తున్న గోదాం ఇన్‌చార్జి బసవన్న గౌడ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆలూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలలకు నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేస్తామని ఆలూరు సివిల్ సప్లై గోదాం ఇన్‌చార్జి బసవన్న గౌడ్ తెలిపారు. మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ముద్దగా అన్నం' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ నాగసుధ ఆదేశాల మేరకు మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు వడ్డించే అన్నాన్ని పరిశీలించారు. అన్నం ముద్దగా ఉండటంతో విద్యార్థినులు సరిగా తినడం లేదని నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని వార్డెన్ సుధారాణి కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, వంట మనుషులు పరిశుభ్రత పాటించాలని ఇన్‌చార్జి సూచించారు.

అపార్ వంద శాతం పూర్తి కావాలి : సబ్ కలెక్టర్

ఆదోని, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో అపార్ వందశాతం పూర్తి కావాలని సబ్ కలెక్టర్ మౌర్య భద్వాజ్ ఆదేశించారు. మంగళవారం కార్యాలయంలో అపార్ తక్కువ శాతం నమోదైన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల మరియు జూనియర్ కళాశాలల హెచ్‌ఎంలు, అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. పేరు, వయస్సు, జెండర్ తప్పులు ఉంటే ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి నివృత్తి చేసుకొని సరి చేయాలన్నారు. ఆదోని ఎంఈవోలు రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులు ఆంజనేయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

బ్రహ్మ విద్యతో ఆనందం



మాట్లాడుతున్న డాక్టర్ మల్లు వెంకట రెడ్డి

మద్దికెర, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మ విద్యతో ఆనందం వస్తుందని టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి పెరవలి గ్రామంలో ధార్మిక కార్యక్రమం ప్రారంభించారు. ఎంతో చరిత్ర గల భారతదేశంలో పుట్టడం పూర్వజన్మ సుకృతమన్నారు. భక్తి మార్గాన్ని ఎన్నుకోవాలని సూచించారు. అనంతరం డాక్టర్ జేవీ దయానంద్ సింగ్ చేసిన ధార్మిక ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం మాజీ సర్పంచ్ వెంకటవర్మ అధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో వీరయ్య, ప్రధాన అర్చకులు రంగనాథాచారి, గ్రామ పెద్దలు పారా రామచంద్ర ప్రసాద్, పోతుల పురుషోత్తం చౌదరి, డి.హనుమంత రావు, రామలింగారెడ్డి, సీతారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో ప్రభుత్వం

మద్దికెర, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో పయనిస్తుందని పంచాయతీ సభ్యుడు జమేదార్ జంబునాథ్ రాయుడు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గడ్డం రామాంజులు, విద్యాకమిటీ చైర్మన్ బొల్లాపురం చంద్ర అన్నారు. మంగళవారం గిడ్డయ్య వీధి, కురువ వీధుల్లో టీడీపీ సభ్యత్వాలను చేపట్టారు. రూ.వంద చెల్లించి సభ్యత్వం తీసుకుంటే రూ.5లక్షల బీమా వస్తుందన్నారు. మాస్టారు, నాగరాజు, తదితరులు ఉన్నారు.

దివ్యాంగుల అభివృద్ధికి పాటుపడాలి



క్రిష్ణగిరిలో కుట్టు మిషన్లు అందిస్తున్న న్యాయాధికారి

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల అభివృద్ధికి పాటు పడాలని ఎంఈవో రాజేంద్రప్రసాద్ సూచించారు. మంగళవారం తిరుమల నగర్‌లోని భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం నిర్మలమ్మ, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు శాంత కుమార్, మౌనిక పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో సాగాలి

ఆలూరు: దివ్యాంగులు ఆత్మ స్థైర్యంతో ముందుకు సాగాలని ఆలూరు జడ్పీ బాలికలు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుజాత సూచించారు. భవిత భవన్‌లో దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బహుమతులు అందించారు. ఉర్దూ స్కూల్ హెచ్‌ఎం సావిత్రి, ఉపాధ్యాయులు రంగస్వామి, స్పెషల్ ఎడ్యుకేటర్ తనూజ, విశ్రాంత ఉపాధ్యాయుడు గోవిందప్ప, భరాందాస్, అరుణ జ్యోతి పాల్గొన్నారు.

వెల్దుర్తి: ఎంపీపీ పాఠశాల (మెయిన్)లో ఎంఈవో-2 రమేశ్, పారిశ్రామికవేత్త సాయిప్రసాద్, వెలుగు ఏపీఎం అనురాధ, ముంతాజ్, గౌసియా, శ్రీదేవి పాల్గొన్నారు. ఎంపీపీ (హరిజనవాడ)లో ఉపాధ్యాయుడు మహేశ్వర్ రెడ్డి కోటేశ్వరమ్మ, చంద్రావతి, సూర్యచంద్ర పాల్గొన్నారు.

మద్దికెర: ఎంపీపీ పాఠశాలలో ఎంఈవో రంగస్వామి, ఎంఈవో-2 గోపాల్, హెచ్‌ఎంలు విశ్వనాథ్, రాజేశ్వరరెడ్డి, మాధవీలత, ఫిజియోథెరపిస్టు బాబయ్య పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ

క్రిష్ణగిరి: మండలంలోని సీక్రెడ్ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డోన్ సివిల్ న్యాయాధికారి తంగమణి పాల్గొన్నారు. ఎంపీడీవో మోహన్ కుమార్, కర్నూలు పార్లమెంటు టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఆలంకొండ నబి సాహెబ్, పార్టీ మండల అధ్యక్షుడు కటారుకొండ మద్రి శ్రీరాములు, కార్యదర్శి మాదాపురం గురుస్వామి, తెలుగు యువత అధ్యక్షుడు బోయ బొంతిరాళ్ళ మహమ్మద్ రఫీ, సీక్రెడ్ సభ్యులు వీరేశమ్మ, దివ్యాంగుల సమాఖ్య అధ్యక్షుడు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆదోని రూరల్: దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు దుగ్గప్ప, ఉపాధ్యక్షుడు హనుమంతరెడ్డి, వీరాంజనేయులు, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: డీవీఎంసీ సభ్యులు కాకర్ల శాంతికుమార్, ఏపీఎం నరసన్న ఏఎస్ఐ శ్రీనివాసులు, ధోని, ఆనంద్, అల్లీపీరా, అంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

విచారణ చేయించండి

పత్తికొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పొదుపు సంఘాలకు సంబంధించి భారతి గ్రామైక్య సంఘంలో చోటు చేసుకున్న అవినీతిపై విచారణ చేయించాలని సభ్యులు డిమాండ్ చేశారు. మంగళారం వారు ఆర్డీవో భరత్‌నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. భారతి గ్రామైక్య సంఘానికి పురుషోత్తం అనే వ్యక్తి వివోఏగా పనిచేసేవాడని, స్త్రీనిధి రుణాలు అందిస్తామని అవకతవకలకు పాల్పడ్డారన్నారు. జిల్లా పీడీ విచారణకు ఆదేశిస్తే అధికారులపై దౌర్జన్యాలకు దిగడంతో ఆయనను సస్పెండ్ చేసి, శ్రీవిద్యను నియమించారన్నారు. చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకే తుగ్గలి మండలానికి చెందిన మహిళను వీవోఏగా నియమించారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని గతంలో జరిగిన అవినీతిపై విచారణ చేసి, కాజేసిన ప్రభుత్వ సొమ్మును రికవరీ చేయాలని కోరారు.

8న ఉచిత కంటి వైద్య శిబిరం

ఆదోని రూరల్ డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న నిర్వహించనున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, కార్యదర్శి డాక్టర్ సైఫుల్లా కోరారు. మంగళవారం జాలిమంచి, గణేకల్లు, తదితర గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. పెద్దతుంబళం గ్రామంలో నిర్వహిస్తున్నామన్నారు. జీవన్‌సింగ్, పద్మనాభయ్యశెట్టి, హుసేన్, రాజేష్ పాల్గొన్నారు.

ఆలూరును అగ్ర స్థానంలో నిలుపుదాం



సభ్యత్వ నమోదుపై చర్చిస్తున్న వీరభద్ర గౌడ్

- టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్

ఆలూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదులో ఆలూరును అగ్రస్థానంలో నిలుపుదామని ఆ పార్టీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ కోరారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ప్రతి కార్యకర్తతో సభ్యత్వం చేయించాలని, సాగు నీటిసంఘాల ఎన్నికలకు సిద్ధం కావాలని కోరారు. రామ్‌నాథ్ యాదవ్, కిష్టప్ప, తిమ్మయ్య, సుధాకర్, పలిరెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



బాధితులతో మాట్లాడుతున్న జనసేన నాయకులు

ఆదోని రూరల్ డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని జనసేన మండల అధ్యక్షుడు తాహేర్ వలి డిమాండ్ చేశారు. మదిరె గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే అర్హులకు పట్టాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టాలున్న వారు తమకు కేటాయించిన స్థలాల్లో నివాసాలను ఏర్పాటు చేసుకోవాలని, ఈ విషయాన్ని పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈరన్న, శ్రీనివాసులు, భీమన్న, అయ్యప్ప, రజాక్, ఖాదర్, మాబాషా, అంజినమ్మ, రాములమ్మ పాల్గొన్నారు.

ఫెంగల్ తుఫాన్‌తో రైతుల అవస్థలు




కరివేముల వద్ద వరి ధాన్యానికి పట్టలు కప్పిన రైతులు

దేవనకొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో రైతులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని దేవనకొండ, కరివేముల, పల్లెదొడ్డి, గుండ్లకొండ, గద్దెరాళ్ల, వెలమకూరు, అలారుదిన్నె, కప్పట్రాళ్ల తదితర గ్రామాల్లో మిరప, వరి సాగు చేశారు. కరివేముల గ్రామంలో వరి కోత దశలో ఉంది. వర్షం ఇంకా కురిస్తే పంట నష్టపోమే ప్రమాధముందని రైతులు వాపోతున్నారు. కొందరు రైతులు పంటనూర్పిళ్లు చేసి కళ్లాల్లో ఉంచిన ధాన్యంపై టార్పిలిన్లను కప్పి ఉంచారు.

ఫసల్ బీమా నమోదు చేసుకోవాలి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- దేవనకొండ ఏవో సురేష్ బాబు



దేవనకొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రబీ పంటలకు రైతులు ఈ నెల 15లోగా బీమా చేసుకోవాలని ఏవో సురేష్‌బాబు తెలిపారు. ఆయన ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: మండలంలో సాగు విస్తీర్ణం ఎంత?

జవాబు: దాదాపు లక్ష ఎకరాల సాగు భూమి ఉంది. ఖరీఫ్‌లో 80 వేలు, రబీలో 15 నుంచి 18 వేల ఎకరాలు సాగు చేస్తారు.

ప్రశ్న: బీమాను ఎలా నమోదు చేసుకోవాలి ?

జవాబు: రబీలో ఫసల్, వాతావరణ బీమా చేసుకొవచ్చు. ఈ నెల 15 లోగా మీసేవా లేదా ఆన్‌లైన్‌లో ప్రీమియం చెల్లించి దరఖాస్తు చేయాలి.

ప్రశ్న: అధిక దిగుబడికి ఎలాంటి పద్ధతులు పాటించాలి ?

జవాబు: రైతులు ఒకే పంట కాకుండా బహుళపంటలు సాగు చేయాలి. పంట మార్పిడి అవలంబించాలి, ఆధునిక పద్ధతిలో సాగు చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చు.

ప్రశ్న: రైతు సేవా కేంద్రాల్లో ఏ రకమైన సేవలు అందుతున్నాయి?

జవాబు: విత్తనాలు, ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో లభ్యమవుతాయి. వ్యవసాయ విస్తరణ అధికారులు అందుబాటులో ఉంటారు. సాగులో సలహాలు, సుచనలు, ఈ క్రాప్ నమోదు, దిగుబడుల విక్రయానికి సహకరిస్తారు.

ప్రశ్న: మండలంలో ఎరువులు, పురుగు మందులు, విత్తన దుకాణాల ఎన్ని ఉన్నాయి. అధిక ధరలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జవాబు: మండలంలో ఎరువుల దుకాణాలు 12, పురుగుమందుల దుకాణాలు 35, విత్తన దుకాణాలు 25 ఉన్నాయి. అధిక ధరలకు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. నకిలివి విక్రయిస్తే దుకాణాన్ని సీజ్ చేస్తాం.

ప్రశ్న: పీఎం కిసాన్‌కు ఎలా దరఖాస్తు చేసుకోవాలి ?

జవాబు: మీసేవ, సీఎస్సీ, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొవచ్చు. కుటుంబంలో ఒకరికి ఏడాదికి మూడు విడతల్లో రూ.6 వేలు రైతు ఖాతాలో జమచేస్తారు. అలా కాంకుటే రైతుసేవా కేంద్రంలో సంప్రదించాలి.

పైపులైన్ ఏర్పాటు చేస్తాం

హలహర్వి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిలేహాల్ గ్రామంలో తాగునీటి పైపులైను ఏర్పాటు చేస్తామని సర్పంచ్ మంజమ్మ మంగళవారం తెలిపారు. పంచాయతీ నిధులతో మూడేళ్లుగా పనులు చేస్తున్నామని ప్రస్తుతం సమస్య పరిష్కారమైందన్నారు. కార్యదర్శి నిరంజన్ కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

హలహర్వి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ చంద్ర సూచించారు. మంగళవారం మాట్లాడుతూ చింతకుంట, కామినహాల్, బిలేహాల్ చెరువులతో పాటు ఎల్లెల్సీ డిస్ట్రిబ్యూటర్ ఎన్నికలను ఈనెల 8న నిర్వహిచనున్నారని, రైతులు సయన్వయం పాటించి, ఏకాభిప్రాయంతో అధ్యక్షులను ఎన్నుకోవాలని కోరారు.

భూసార పరీక్షలు ఉపయోగకరం



భూసార పత్రాలు అందజేస్తున్న ఆత్మ బీటీఎం యశ్వంత్

మద్దికెర, డిసెంబరు 3 (ఆంధ్ర జ్యోతి): భూసార పరీక్షలు చేయిస్తే సాగుకు ఉపయోగమని ఆత్మ బీటీఎం యశ్వంత్, ఏవో రవి సూచించారు. మంగళవారం రైతు సేవా కేంద్రంలో రైతులకు భూసార పరీక్షల ఫలితాల కార్డులను అందజేశారు. శనగ, జొన్న, వాము పంటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. డిసెంబరు 15లోపు బీమా చేసుకోవాలన్నారు. తుఫాన్ ప్రభావంతో పంటలు దెబ్బతిని ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఏఈవో భోజరాజు, వ్యవసాయ సహాయకులు జాకీర్ హుశేన్, రాణి, కవిత తదితరులు పాల్గొన్నారు.

అధికారులను సస్పెండ్ చేయాలి

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నంద్యాల గిరిజన హాస్టల్ విద్యార్థుల మరణానికి కార్మికులైన అధికారులను సస్పెండ్ చేయాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాయలసీమ ఇన్‌చార్జి మోహూరు సూర్య డిమాండ్ చేశారు. మంగళవారం మాట్లాడుతూ నంద్యాల గిరిజన హాస్టల్‌లో మరుగుదొడ్డి లేక కాలకృత్యాల కోసం ఆరుబయటకు వెళ్లిన సతీష్ రైలు ప్రమాదంలో మృతిచెందాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు డీటీడబ్ల్యూవో శివప్రసాద్, ఏటీడబ్ల్యూ హుసేనయ్యలే కారణమని ఆరోపించారు. కుటుంబానికి రూ.25లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వక్ఫ్ బోర్డు రద్దు కాలేదు

ఆదోని/టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డ్‌ను రద్దు చేయలేదని, ప్రతిపక్షాల ఆరోపణల్లో నిజం లేదని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి కార్యదర్శి నూర్ అహ్మద్ అన్నారు. మంగళవారం మాట్లాడుతూ కులమతాలకతీతంగా పరిపాలించే అనుభవం చంద్రబాబుకు ఉందని, వైసీపీ హయాంలో ఏర్పాటు చేసిన వక్ఫ్ బోర్డ్ కమిటీని మాత్రమే రద్దు చేశారన్నారు.

వర్చువల్ విధానంతో మెరుగైన ఫలితాలు




వర్చువల్ ట్రయల్ రన్ ద్వారా పాఠం వింటున్న విద్యార్థులు

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో మెరుగైన ఫలితాల సాధనకు వర్చువల్ విధానం ఉపయోగకరమని డీఈవో డీఈవో శామ్యూల్ పాల్ అన్నారు. మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి ఎంపిక చేసిన పాఠశాలలకు వర్చువల్ విధానంలో డెమో తరగుతులు ప్రారంభించారు. పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో హెచ్‌ఎంలు అలిం సిద్ధికి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. డీఈవో విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా ప్రయోగాత్మకంగా ఈ వర్చువల్ విధానాన్ని ఏర్పాటు చేశారని, త్వరలోనే పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

6న ఆలూరులో జాబ్ మేళా

ఆలూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 6న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎల్.ఆనంద్ రాజ్ కుమార్, ప్రిన్సిపాల్ వి.రమాదేవి మంగళవారం తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని, అమరరాజా, నవ భారత్ ఫర్టిలైజర్స్ పతినిధులు పాల్గొంటారన్నారు. నిరుద్యోగులు పది, ఇంటర్, డిగ్రీ, చదివి 18-35సంవత్సరాల్లోపు వయసు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.10వేల నుంచి 15వేల వరకు జీతం ఉంటుందన్నారు. విద్యార్హత పత్రాలు జిరాక్స్, ఆధార్, , రెండు ఫోటోలు తీసుకురావాలన్నారు. వివరాలకు సెల్ 9010003132 నంబర్లో సంప్రదించాలన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు టీషర్టులు పంపిణీ చేస్తున్న దాతలు

పత్తికొండ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉందని కేడీసీసీ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ సూచించారు. యూనివర్సిటీ ఫుట్‌బాల్ పోటీల క్రీడాకారులకు మంగళవారం టీషర్టులను అందజేంచారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందవచ్చన్నారు.

ఎమ్మిగనూరులో కార్డన్ సెర్చ్

ఎనిమిది వాహనాలు స్వాధీనం



పట్టుబడిన ద్విచక్ర వాహనాలతో డీఎస్పీ, సీఐలు, పోలీసులు

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులోని శక్తినగర్, ఎన్టీఆర్ కాలనీ, శాంతినగర్, శివన్ననగర్, వెంకటాపురం, లక్ష్మీపేటలలో డీఎస్పీ ఉపేంద్ర బాబు ఆధ్వర్యంలో మంగళవారం తెల్లవారుఝామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సబ్ డివిజన్ పోలీసులు ఆరు బృందాలుగా ఏర్పడి సోదాలు నిర్వహించారు. అనుమానితుల ఇళ్లల్లో తనిఖీలు చేశారు. ఎనిమిది బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఉపేంద్ర బాబు మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో నడవాలని అన్నారు. కార్యక్రమంలో సీఐలు శ్రీనివాసులు, మంజునాథ్, రామాంజనేయులు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పంట బీమా చెల్లించాలి: ఏవో

నందవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులు రబీ సీజన్‌కు గాను సాగు చేసిన పంటలకు బీమా చెల్లించాలని ఏవో స్రవంతి మంగళవారం తెలిపారు. బీమా సొమ్మును సీఎస్‌సీలేదా, దగ్గరలోని మీ సేవలో చెల్లించవచ్చన్నారు. వరికి మాత్రం ఈనెల 31లోపు చెల్లించాలని తెలిపారు.

'బీమా చేసుకోవాలి'

గోనెగండ్ల: ప్రస్తుతం రబీ సీజన్ 2024-25కు గాను ప్రతి రైతు పంటలకు బీమా చేసుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత కోరారు. మంగళవారం వారు మాట్లాడుతూ పంటలపై బ్యాంక్‌లో రుణం తీసుకున్నవారికి బ్యాంక్ అధికారులు బీమా చెల్లిస్తారు. రుణం తీసుకోనివారు మాత్రం బీమాను రైతులే కట్టుకోవాలన్నారు. కౌలు రైతులు కూడా పంటల బీమాకు అర్హులన్నారు. పంటబీమా చెల్లించుటకు కావాల్సిన పత్రాలు పంట సాగు ధృవీకరణ పత్రం, రైతు ఆధార్‌కార్డు, పొలం పాస్‌పుస్తకం, బ్యాంక్ పాస్‌పుస్తకం, కౌలురైతు అయితే సీసీఆర్‌సీ కార్డు, కావాలన్నారు. ఈ నెల 15లోగా బీమా చెల్లించాలన్నారు.

ఘనంగా కోసిగయ్య స్వామి కార్తీక దీపోత్సవం



కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కోసిగి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కోసిగయ్య స్వామి దేవాలయంలో కార్తీక దీపోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు ఆలయంలో కార్తీకదీపాలు వెలిగించి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోసిగితో పాటు వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి, ఆకు పూజలు, మహా మంగళహారతులు చేశారు. నెల రోజులుగా కార్తీక దీపోత్సవ వేడుకలను ఆలయంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు పూజారి శ్రీనివాసులు తెలిపారు.

ధార్మిక పర్యటనకు బయలుదేరిన పీఠాధిపతి

మంత్రాలయం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ధార్మిక పర్యటనలో భాగంగా హైదరాబాదుకు బయలుదేరి వెళ్లారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు చేసి సాయంత్రం తన శిష్యబృందంతో బయలుదేరి వెళ్లారు. రెండురోజులు హైదరాబాదుతోపాటు విజయవాడ తదితర ప్రాంతాల్లో పర్యటించి అక్కడి భక్తులను ఆశీర్వదించనున్నారు. 6న మంత్రాలయం తిరిగి చేరుకుంటున్నట్లు తెలిపారు. ధార్మిక పర్యటనలో వెళ్తున్న పీఠాధిపతి వెళ్తున్నందున మంత్రాలయంలో పీఠాధిపతి ఉండరని, భక్తులు గమనించి సహకరించాలన్నారు.

మఠానికి విరాళం: రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన సీకే లీల అనే భక్తురాలు రూ.రెండులక్షలు విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జ్యోషి తెలిపారు. మంగళవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ. లక్ష అన్నదానానికి, మరో రూ.లక్ష గోశాలకు విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాతల కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల,పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

కేబుల్ ఆపరేటర్లపై ఎమ్మెల్యే ఆగ్రహం

ఎమ్మిగనూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు కేబుల్ ఆపరేటర్ల ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఎమ్మిగనూరు కేబుల్ ఆపరేటర్లు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని స్వగృహంలో పట్టణంలోని కొంతమంది కేబుల్ ఆపరేటర్లు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేబుల్ ఆపరేటర్లను లీడ్‌చేస్తున్న ఓ కేబుల్ ఆపరేటర్‌ను ఉద్దేశించి ఘాటుగా స్పందించినట్లు తెలిసింది. ఐదేళ్ల తర్వాత మీకు ఇప్పుడు కనిపించామా.. అని నిలదీశారు. గత ఐదేళ్లలో రెండు ప్రముఖ ఛానెళ్ల ప్రసారాలను ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు. అధికారంలో ఉంటే ఓ రకంగా..అధికారం లేకుంటే మరోరకంగా వ్యవహరిస్తున్నారని.. ఇది సరైన పద్ధతి కాదన్నారు. చివరికి తమ పార్టీకి సంబంధించిన ప్రకటనలను సైతం ప్రసారం చేసేందుకు కూడా వెనుకాడారన్నారు. ఇది సరైన పద్ధతేనా.. ప్రస్తుతం మేము అలా చేస్తున్నామా అంటూ కేబుల్ ఆపరేటర్లకు ఎమ్మెల్యే బీవీ చురకలంటించారు. ఎమ్మెల్యే అడిగిన ప్రశ్నలకు ఏమి సమాధానం చెప్పాలో అర్థంకాగా కేబుల్ ఆపరేటర్లు మిన్నకుండిపోయారు. మేము గత ప్రభుత్వం మాదిరిగా రాజకీయాలు చేయమని మాకు అందరు సమానమేనని కేబుల్ ఆపరేటర్ల సంక్షేమానికి తప్పకుండా కృషి చేస్తామన్నారు. అనంతరం ఆయనను కేబుల్ ఆపరేటర్లు ఘనంగా సన్మానించారు.

తల్లిదండ్రులను భాగస్వాములుగా చేయండి



హెచ్ఎంలకు నగదు పంపిణీ చేస్తున్న ఎంఈవోలు

మంత్రాలయం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు భాగస్వాములుగా అయ్యే విధంగా చూడాలని ఎంఈవోలు షైనుద్దీన్, రాగన్న అన్నారు. మంగళవారం ఎంఆర్‌సీ భవన్‌లో ఆయా పాఠశాలల విద్యార్థుల సంఖ్యను బట్టి ఈ నెల 7న నిర్వహించే తల్లిదండ్రుల సమావేశానికి నగదును పంపిణీ చేశారు. సమావేశంలో సీఆర్పీలు నరసన్నగౌడు, బంగారప్ప, భీమేష్, హెచ్ఎంలు రామ్మోహన్, అంపయ్య, వీరేష్, నాగేంద్ర, వంశీ, సరళాదేవి, జాన్సన్, లచ్చప్ప, గుర్రాజు, విజయకుమార్ పాల్గొన్నారు.

మిరప రైతును వణికిస్తున్న 'ఫెంగల్'

- రంగు మారుతున్న పంట
- ఆందోళనలో రైతులు

ఎమ్మిగనూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వేల రూపాయలు పెట్టుబడి పెట్టి ఆరుగాలం కష్టంచి పండించిన మిరప పంట రైతులను ఈ ఏడాది ఫెంగల్ తుఫాన్ వణికిస్తోంది. ఎమ్మిగనూరు సబ్‌డివిజన్ పరిధిలో ఈ ఏడాది దాదాపు 18నుంచి 20వేల ఎకరాల్లో మిరప పంటను రైతులు సాగు చేశారు. ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.1.50లక్షల వరకు పెట్టుబడులు పెట్టారు. మిరప పంట చేతికి రావడంతో ఎమ్మిగనూరు మండలంతోపాటు సబ్‌డివిజన్ పరిధిలోని గోనెగండ్ల, నందవరం, మంత్రాలయం మండలాల్లో మిరప రైతులు పంటను కోసి కల్లాల్లో ఆరబోస్తున్నారు. అయితే బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వారం రోజులుగా జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తు న్నాయి. ఎమ్మిగనూరు ప్రాంతంలో సైతం వాతావరణంలో మార్పులు చోటు చేసుకొని ముసురు కమ్ముకోవడంతో పాటు చిన్నపాటి వర్షాలు కురుస్తునే ఉండడంతో రైతన్నలు ఆరబోసిన మిరప, వరిని కాపాడుకునేందుకు నానావస్థలు పడుతున్నారు. ఉన్నట్టుండి వర్షం రావడం, మిరప, వరి ధాన్యం తడిసిపోవడంతో మిరప పండు రంగు ఆరబోసిన చోటే మారుతుండడంతో రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డీలక్స్ రకం దాదాపు క్వింటం రూ.12-13వేలు పలకాల్సి ఉంది. రంగు మారడంతో మార్కెట్‌లో మిర్చీ వ్యాపారులు రూ.6 వేల నుంచి రూ. 7వేలకు అడగడం లేదు. వరి రైతులది కూడా ఇదే పరిస్థితి. గతేడాదికంటే ఈ ఏడాది రూ.వెయ్యి ధర తగ్గింది. దీనికి తోడు ఫెంగల్ తుఫానుతో ధాన్యం తడవడంతో వ్యాపారులు వరిధాన్యాన్ని కొనేందుకు ముందుకు రావడంలేదు. తడిసిన ధాన్యానికి, మిరప పంటకు ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని రైతున్నలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పెద్దకడుబూరు: మండల కేంద్రమైన పెద్దకడబూరు, దొడ్డిమేకల, రాగిమాన్‌దొడ్డి, హనుమాపురం, మురవణి గ్రామాల్లో మిరప, వరి ధాన్యం కల్లాల్లో ఆరబెట్టారు. తుఫాన్ కారణంగా వర్షాలు కురువటంతో రైతన్నలకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. అసలే పంటలకు తెగుళ్ళ, పురుగులకు ఆశించడం పంట దిగుబడి తగ్గటం వల్లన రైతులు దిగులు చెందుతున్నారు.

కోసిగి: రెండు రోజులుగా తుఫాన్ వర్షానికి రైతులకు అపార నష్టం జరిగింది. చేతికొచ్చిన పంట కళ్లముందే నల్లబారి పోతుండటంతో చింతకుంటలో ఎండుమిర్చి రైతుల ఆవేదన అంతా ఇంతా కాదు.. ప్రభుత్వమే ఆదుకోవాలని ఎండు మిర్చి రైతులు కప్ప పెద్దలక్ష్మయ్య, హనుమంతు, నర్సప్పగారి రామయ్య, ఎర్రదొడ్డి శివయ్య కోరుతున్నారు.

గోనెగండ్ల: మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న అకాలవర్షాలతో వరి, ఉల్లి రైతులు విలవిల లాడుతున్నారు. కోసిన పంట ఆరబెట్టేందుకు వీలు లేకుండా ఉండటంతో వరి గింజలలో మొలకలు వస్తున్నాయి. దీనికి తోడు వర్షంకు తడిసిన పంట రంగు మారి పోతుంది. గోనెగండ్ల మండలంలో 200 ఎకరాల్లోని ఈ అకాలవర్షాలకు వరి పంట దెబ్బతిన్నట్లు తెలుస్తుంది. అకాల వర్షం కారణంగా ఉల్లి తడిసి పోయిందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు.



చింతకుంటలో..



గోనెగండ్లలో..



మిరప పంట తడవకుండా టార్పాలిన్ కప్పుతున్న రైతు



హనుమాపురంలో..

మిరప పంట రంగు మారుతోంది



నేను ఐదు ఎకరాల్లో దాదాపు రూ.6లక్షల పెట్టుబడి పెట్టి మిరప పంటను సాగుచేశాను. పంట కోతకు రావడంతో మిరప పంటను కోసి ఆరబెట్టాను. వారంరోజులుగా ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షానికి పంట తడిసి రంగు మారుతోంది. దీంతో ధర సగానికి పైగా పడిపోయింది. ప్రస్తుతం పంటను అమ్మితే కూలీలకు కూడా సరిపోవడం లేదు.

- వెంకటేశ్వర్లు, రైతు, వెంకటాపురం

ప్రభుత్వం కొనుగోలు చేయాలి



మాకున్న మూడు ఎకరాల్లో వరి పంటను సాగు చేశాం. పంటచేతికి రావడంతో వరిపంటను కోసి ఆరబెట్టాము. ఇదేసమయంలో తుఫాన్ పట్టుకోవడంతో ధాన్యాం కాస్తా తడిసింది. తడిసిన ధాన్యాన్ని కొనేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. ప్రభుత్వం వరి పంటను మద్దతు ధరకు కొనుగోలు చేసి ఆదుకోవాలి.

- బోయ మహాదేవి, మహిళా రైతు, గుడికల్లు

సాగు నీరు అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి
- జీడీపీ కుడి, ఎడమ కాలువలకు నీటి విడుదల

గోనెగండ్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతాంగానికి పంటలు చేతికి అందేవరకు సాగు నీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం గాజులదిన్నె ప్రాజెక్టులోని నీటికి గంగా పూజ చేసి ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ద్వారా ఆయకట్టు రైతులకు సాగు నీటిని ఎమ్మెల్యే బీవీ విడుదల చేశారు. కుడి కాలువకు 30 క్యూసెక్కుల నీరు, ఎడమ కాలువకు 30 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులనుద్దేశించి మాట్లాడుతూ ఈ ఏడాది రబీ సీజన్‌లో ఆయకట్టు రైతులకు సాగు నీరు విడుదల చేస్తున్నామని ప్రాజెక్టులో 2.2 టీఎంసీ నీరు ఉన్నందుకు ప్రస్తుతం 13వేల ఎకరాలకు సాగునీరు విడుదల చేస్తున్నామన్నారు. రైతులు వేరుశనగ, మొక్కజొన్న, సజ్జ, తదితర ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. పంటలు రైతుల చేతికి అందే వరకు సాగు నీరు అందిస్తామన్నారు. జీడీపీ నీటికి ఆర్‌డీఎస్, గుండ్రేవుల ప్రాజెక్టు నీరు తోడైతే జిల్లాపశ్చిమ ప్రాంతం సస్యశామలం అవుతుందని జీడీపీ, ఆర్‌డీఎస్ ప్రాజెక్టుల పనులు పూర్తి అయితే ఇక వీటి కింద అధికారికంగా 40వేల ఎకరాలు సాగు అనాధికారికంగా లక్ష ఎకరాల పంట భూములు సాగవుతాయని అన్నారు. జీడీపీ కింద ఆయకట్టు భూములకు సాగు నీరు విడుదల చేయడంతో రైతుల ఆనందం వ్యక్తం చేస్తు న్నారు.



జీడీపీ నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి

కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ విజయ్‌కుమార్, ఏఈ మహమ్మద్ ఆలీ, ఉగ్రనరసింహుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకం: ప్రభుత్వం ప్రకటించే ప్రతి సంక్షేమ పథకం పేదలకు అందేవిధంగా చూస్తామని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వేముగోడు గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామంలోని పలు వీధుల్లో తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తరేషన్ కార్డులు, పింఛన్లు, హౌసింగ్ ఇళ్లకు ఆన్‌లైన్ చేస్తుందన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు సత్యంస్వామి, తహసీల్దార్ కుమారస్వామి, ఎంపీడీవో స్వర్ణమంజరి, సీఐ గంగాధర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి, పీఆర్‌ఏఈ శివశంకర్, ఏవో హేమలత, విద్యుత్ ఏఈ సుధాకర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని విమర్శించే స్థాయి లేదు: టీడీపీ



మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు రామకృష్ణారెడ్డి

కోసిగి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే స్థాయి వైసీపీ మంత్రాలయం నాయకుడు వై.ప్రదీప్ రెడ్డికి లేదని టీడీపీ నాయకుడు ఎస్.రామకృష్ణారెడ్డి అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో దాచుకోవడం, దోచుకోవడం తప్ప అభివృద్ధి ఎక్కడ జరి గిందని ప్రశ్నించారు. మంగళవారం కోసిగిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయుడు అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన నిధులను వాడుకొని పంచాయతీలను నిర్వీర్యం చేసిందన్నారు. ఎన్నో అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, జ్ఞానేష్, తోవి రామకృష్ణ, నాడిగేని అయ్యన్న, వక్రాణి వెంకటేశ్, నాడిగేని చిన్నతాయన్న, చింతలగేని నర్సారెడ్డి, ఈరన్న, వీరేష్, మదిరి వీరారెడ్డి, ఆర్లబండ సర్పంచ్ మల్లికార్జున, ఈరయ్య, బీజేపీ రాముడు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

కోసిగి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కోసిగిలోని 9వ వార్డుకు చెందిన ఉప్పర శ్రీనివాసులు కుమారుడు ఉప్పరి తరుణ్ (9) తలసేమియా వ్యాధితో చికిత్స పొందుతూ హైదరాబాదులో మృతి చెందాడు. మృతుడి తండ్రి ఉప్పర శ్రీనివాసులు వివరాల ప్రకారం.. వైద్య ఖర్చుల కోసం టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి సహకారంతో రూ.10 లక్షలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అందించారని, సొంత డబ్బు, దాతల సహకారంతో చికిత్స అందించినప్పటికీ తరుణ్ కోలుకోలేక మృతి చెందాడు. వైద్య ఖర్చుల కోసం సుమారు రూ.5 లక్షలు అప్పు చేసినా తమ కుమారుడు మరణించాడని తండ్రి కన్నీటి పర్యంతమయ్యాడు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కౌతాళం, నవంబరు 3: మండలంలోని హల్వి గ్రామంలో మంగళవారం సాయంత్రం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు కౌతాళం సీఐ అశోక్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ హల్వి గ్రామంలోని జగనన్న కాలనీలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో కలిసి దాడి చేసి ఆరుగురు వ్యక్తులతోపాటు మూడు ద్విచక్ర వాహనాలు, రూ.6500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ సోమ్లనాయక్, కానిస్టేబుళ్లు రామాంజనేయులు, వీరాంజనేయులు, మోహన్ రాజు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులను గౌరవించాలి

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సమాజంలో విభిన్న ప్రతిభావంతులను గౌరవించి వారికి అన్ని విధాలుగా చేయూత అందిస్తుండాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం మంత్రాలయం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో పాఠశాల హెచ్ఎం హంపయ్య, ఎంఈవో షైనుద్దీన్, సీఆర్పీలు నరసన్నగౌడు, బంగారప్ప, భీమేష్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. వివిధ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ పరమేష్ నాయక్, టీడీపీ నాయకులు అశోక్ రెడ్డి, వరదరాజులు, ఎంపీటీసీలు మేకల వెంకటేశ్, రాఘవేంద్ర, బీసీ తిమ్మప్ప, శివ, మేకల నరసింహులు, రాగన్న, బొజ్జప్ప, రాజు, ఉపాధ్యాయులు విఠోభరావు, గోపాల్, చంద్రశేఖర్, రామన్న, పలు గ్రామాల నుంచి విభిన్న ప్రతిభావంతులు తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: విభిన్నప్రతిభావతులు అన్ని రంగాలలో ముందుకు రాణించాలని గోనెగండ్ల సీఐ గంగాధర్, ఎంఈవో నీలకంఠప్ప అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన గోనెగండ్లలో అంతర్జాతీయ విభిన్నప్రతిభావతుల దినోత్సవాన్ని భవిత కేంద్రం దగ్గర పాఠశాల ఉపాధ్యాయులు అనురాధ, నారాయణమ్మ నిర్వహించారు. భవిత పాఠశాల విద్యార్థులకు వ్యాపారి ప్రసాద్‌శెట్టి విద్యార్థులకు టిఫిన్‌బాక్స్‌లు ఇవ్వగా సీఐ గంగాధర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యాపారి ప్రసాద్‌శెట్టి, గానిగ బాషా, మాలిక్ బాషా ఉపాధ్యాయులు పరిమళ, శిరోమణి, కేర్‌గివర్



దివ్యాంగులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రాఘవేంద్రరెడ్డి

ఖాజాబి, సీఆర్‌పీలు పుల్లన్న, రవికుమార్, విజయరాణి, కవిత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ మేయిన్ పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ విభిన్న ప్రతి భావంతుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు ఇచ్చారు. ఎంఈవోలు సువర్ణ, రామ్మూర్తి, లైబ్రేరియన్ ఆశాజ్యోతి, ఎంఐఎస్ లక్ష్మణ్, సీఆర్పీ కృష్ణ ఆచారి, ఉపాధ్యాయులు కేశవ, ఐఈఆర్‌టీలు ఎర్రకోట గోపాల్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

నందవరం: మండల కేంద్రంలో విభిన్న ప్రతిభాంతుల దినోత్సవ వేడుకలు మంగళవారం ఉపాధ్యాయులు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులను ఎంఈవో సుదర్శన్ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుబ్బన్న, ఉరుకుందు, ప్రశాంతకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరుకుంద హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపులో పాల్గొన్న ఆలయ సిబ్బంది

కౌతాళం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామికి భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈవో విజయరాజు ఆధ్వర్యంలో లెక్కించారు. నగదు రూపంలో రూ.1,20,75,027లు, బంగారము 45.200మిల్లి గ్రాములు, వెండి 19.75 కిలోలు వచ్చినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో హుండీ పర్యవేక్షణ అధికారి వెంకటేశ్వరరావు, ఆలయ అధికారులు మల్లికార్జున, వెంకటేశ్వరరావు, దేవాలయపు ఉప ప్రధాన అర్చకులు మహదేవప్ప, అర్చకులు నాగరాజు స్వామి, శివన్న స్వామి, ఏపీజీబి బ్యాంకు సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

10లోపు గదులను ఖాళీ చేయాలి: మండలంలోని ఉరుకుంద గ్రామంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయానికి చెందిన అద్దె గదులలో నివాసం ఉంటున్న ఆలయ సిబ్బంది ఈ నెల 10లోపు ఖాళీ చేయాలని దేవాలయపు డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేవాలయపు అద్దెగదులు స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు కేటాయించగా, కొందరు సిబ్బంది ఇదే గదులలో నివాసం ఉంటున్నట్లు గుర్తించామన్నారు. గదులు భక్తులకే కేటాయిస్తామన్నారు.

లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం



ముగతి వద్ద బోల్తా పడ్డ లారీ

నందవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎమ్మిగనూరు-మంత్రాలయం వెళ్లే రహదారిలో మంగళవారం పత్తి బేళ్ల లారీ అదుపుతప్పి బోల్తా పడింది. మంత్రాలయం మీదగా పత్తి బేళ్ల లారీ వెళ్తూ ముగతి సర్కిల్‌లోని ఎమ్మిగనూరుకు వెళ్లే మలుపు దగ్గర క్రాస్ అదుపు తప్పింది. దీంతో ఒక్క సారిగా లారీలో లోడ్ అధికంగా ఉండడంతో పై టాప్ లేచిపోయింది. స్థానికులు పెద్ద శబ్దం రావడంతో ఉలిక్కిపడ్డారు. డ్రైవర్, క్లీనర్ ప్రమాదం నుంచి బయటపడ్డారు.

మా భూమి మాకు ఇప్పించాలి

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితుడి దీక్ష



నిరసన దీక్ష చేస్తున్న బాధిత కుటుంబం

మంత్రాలయం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల క్రితం తన భూమిని ఆన్‌లైన్‌లో తొలగించారని, మా భూమి మాకు ఇప్పించాలని పరమాన్‌దొడ్డి తండాకు చెందిన గంగనాయక్ కోరారు. భార్యా పిల్లలతో కలిసి మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ముందు రెండో రోజు నిరసన దీక్ష చేపట్టారు. భూమిని తమ పేరిట మార్చే వరకు పోరాటం చేస్తామని బాధితుడు తెలిపారు.

మంచాలమ్మకు విశేష పుష్పాభిషేకం

మంత్రాలయం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వేదపండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య గ్రామ దేవత మంచాలమ్మకు విశేష పుష్పాభిషేకం నిర్వహించారు. మంగళవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో మంచాలమ్మకు ప్రత్యే పూజ లు చేశారు. అమ్మవారికి బంగారు, వెండి ఆభరణాలతో అలంకరించి విశేష పుష్పాలతో పీఠాధిపతి పుష్పాభిషేకం చేశారు. అలాగే రాఘవ రాయుడుకి పూజలు చేసి మంగళహారతులు ఇచ్చారు.



పుష్పాలంకరణలో మంచాలమ్మ